
ఆంధ్రజ్యోతి
5
ANDHRAJYOTHY
శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శనివారం 21 సెప్టెంబరు 2024



జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్‌గా హరివర్మ

● యథాస్థానానికి కుమారి బదిలీ

నెల్లూరు(హరనాథపురం) : మార్కెట్ వ్యాల్యూ జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ అన్నమయ్య జిల్లా రాయచోటికి బదిలీ అయిన సీఆర్ హరివర్మను తిరిగి నెల్లూరు జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం జిల్లా రిజిస్ట్రార్‌గా పని చేస్తూ నెల్లూరుకు బదిలీపై వచ్చి విధులు నిర్వహిస్తున్న ఆడిట్ రిజిస్ట్రార్ కుమారిని యథాస్థానానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పరువు కోసం కుమార్తెనే కడతేర్చారు!

గ్రామస్థుల సమాచారంతో వెలుగులోకి.. ● పోలీసులు అదుపులో నిందితులు

కొడవలూరు, సెప్టెంబరు 20 : అల్లారు ముద్దుగా పెంచిన ఆడబిడ్డ పెళ్లైన ఏడాదికే భర్తతో విభేదాల కారణంగా ఇంటికి తిరిగొచ్చేసింది. ఆ తర్వాత ఆమె వేరే మతానికి చెందిన వ్యక్తిని ప్రేమించి పెళ్లిచేసుకోవడాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేక గొంతు నులిమి హత్య చేశారు. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలంలో 25 రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.



శ్రావణి (ఫైల్)

కొడవలూరు మండలం సత్రం గ్రామానికి చెందిన సన్నకారు రైతు తిరుమూరు వెంకట రమణయ్య, దేవసేనమ్మలకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అనారోగ్యం కారణంగా పదిహేనేళ్ల క్రితం పెద్దకుమారుడు మృతి చెందగా, మిగిలిన ముగ్గురినీ అల్లారు ముద్దుగా పెంచి, ప్రయోజకులను చేశారు. వీరిలో మూడవ సంతానం తిరుమూరు శ్రావణిని (24) ఐదేళ్ల క్రితం సంగం మండలం సిద్దీపురానికి చెందిన రాజేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. అయితే, పెళ్లి అయిన ఏడాదికే కుటుంబంలో కలహాలు రావడంతో భర్తతో విడాకులు తీసుకుని తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఈ క్రమంలో రెండు నెలల క్రితం అల్లూరు మండలం ఆములూరు గ్రామంలో మరో మతానికి చెందిన ఓ వ్యక్తిని ప్రేమించి, పెళ్లి చేసుకుంది. పరువుకు ప్రాధాన్యత ఇచ్చే శ్రావణి తల్లిదండ్రులు కుమార్తె చేసుకున్న వివాహంపై లోలోన రగిలిపోతూ వచ్చారు. ఈ నేపథ్యంలో నెల రోజుల క్రితం తన కుమార్తెను అపహరించాడంటూ భర్తపై అల్లూరు పోలీసులకు శ్రావణి తండ్రి వెంకటరమణయ్య ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత కుమార్తెకు నచ్చజెప్పి ఇంటికి తీసుకొచ్చారు. అయితే, ఇంటికి వచ్చినా తాను భర్తతోనే కలిసి ఉంటానని, తనను పంపేయాలంటూ కుటుంబ సభ్యులతో శ్రావణి గొడవ పడేది. ఈ నేపథ్యంలో 25 రోజుల క్రితం జరిగిన ఘర్షణలో కోపోద్రిక్తులైన తల్లిదండ్రులు కుమార్తె గొంతు నులిమి హత్య చేసినట్టు సమాచారం. ఆ తర్వాత మృతదేహాన్ని తమ ఇంటి వెనుక గడ్డివామి వద్ద పూడ్చిపెట్టారు. ఈ విషయం ఆ నోటా ఈ నోటా పడి బయటకు పొక్కడంతో గ్రామానికి చెందిన కొంతమంది గురువారం 100 ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అదే రోజు రాత్రి వెంకట రమణయ్య ఇంటికి వెళ్లిన పోలీసులు శ్రావణి ఏమైందంటూ నిలదీశారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం నెల్లూరు డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ సురేంద్రబాబు, ఎస్ఐ కోటిరెడ్డి తమ సిబ్బందితో తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంటి వెనుక పూడ్చిపెట్టిన శ్రావణి మృతదేహాన్ని వెలికి తీయించి, పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మృతురాలి తల్లిదండ్రులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు వెల్లడించారు. ఇదివరకే కొంత సమాచారం ఇచ్చారని, ఇంకా పూర్తిస్థాయిలో నిందితులను విచారించాల్సి ఉందని తెలిపారు. కొడవలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒక్కో షాపు పరిధిలో రేషన్‌కార్డుల సంఖ్య ఇది

గ్రామాల్లో 500 కార్డులు ఉండేలా కసరత్తు

ఆ తర్వాత కొత్త షాపుల ప్రకటన

డీలర్ల నియామకానికి నవంబరు 8న ఇంటర్వ్యూలు

కార్పొరేషన్‌లో 800.. మున్సిపాలిటీల్లో 600



నెల్లూరు (హరనాథపురం) : రేషన్ షాపుల హేతుబద్ధీకరణకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కార్పొరేషన్, మున్సిపాలిటీ, గ్రామాలలో ఒక్కో షాపు పరిధిలో ఎన్ని కార్డులు ఉండాలనే అంశమై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆ శాఖ కమిషనర్ నుంచి విధి విధానాలు అందాయి. ఈ ప్రకారం షాపులకు కార్డులు కేటాయించి హేతుబద్ధీకరణ పూర్తి చేస్తారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా మండలాల వారీగా కార్డులు, రేషన్ షాపుల వివరాలను అధికారులు సేకరించారు. ఈ నెలాఖరులోగా రేషనలైజేషన్‌కు అర్హత ఉన్న డిపోల వివరాలు, ఖాళీల సంఖ్యను గుర్తిస్తారు. అక్టోబరు 3వ తేదీన రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు. అక్టోబరు 4న కొత్తగా ఎన్ని రేషన్ షాపులు అవసరమో గుర్తిస్తారు. దీని ఆధారంగా అక్టోబరు 24న ఖాళీల సంఖ్యతోపాటు కొత్త డిపోలను ప్రకటిస్తారు. ఆ తరువాత దరఖాస్తులను ఆహ్వానించి నవంబరు 7వ తేదీన రాత పరీక్ష, 8న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను నవంబరు 15న ప్రకటించి 16న నియామక పత్రాలు అందచేస్తారు. ఎంపికైన డీలర్లకు 23న ఈపాస్ మిషన్లు అందచేస్తారు.

● 1,513 రేషన్ షాపులు

జిల్లాలో 1,513 రేషన్ షాపులు ఉండగా, వీటిలో 238 షాపులకు డీలర్లు లేరు. ఆ ఖాళీలలో ప్రస్తుతం పక్కనే ఉన్న డీలర్లను, పొదుపు సంఘాల సభ్యులను నియమించి సరుకులు పంపిణీ చేయిస్తున్నారు. ఎండీయూ వాహనాలు ఉన్నా, డీలర్లు షాపునకు వెళ్లి లబ్ధిదారులకు సరుకులు అందచేస్తూనే ఉన్నారు. హేతుబద్ధీకరణ విధివిధానాల ప్రకారం కార్పొరేషన్ పరిధిలోని ఒక్కో షాపునకు 800 కార్డులు, మున్సిపాలిటీల పరిధిలోని షాపునకు 600, గ్రామ ప్రాంతాల్లోని షాపునకు 500 కార్డులు ఉండేలా సమరిస్తారు. మండలాల వారీగా 500 కార్డులకు పైబడి వున్న షాపులను అధికారులు గుర్తించారు. వీటిలో నెల్లూరులో అత్యధికంగా 145 షాపులు ఉండగా, కావలిలో 55, బుచ్చిలో 22, ఆత్మకూరులో 19, కందుకూరులో 29, కోవూరులో 21, వెంకటాచలంలో 20 ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో 500 కార్డులకు పైబడి 590 షాపులు ఉన్నట్లు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్లు గుర్తించారు. ఈ అంశానికి సంబంధించి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి డీవీ. రమణ మాట్లాడుతూ జిల్లాలో కార్డుల ప్రాతిపదికగా రేషన్ షాపుల హేతుబద్ధీకరణ పూర్తి చేస్తామని చెప్పారు. ఆ తరువాతనే కొత్త డిపోల ఏర్పాటు ఉంటుందని స్పష్టం చేశారు.

'విజయ'లో ఎన్నికల నగారా

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : నెల్లూరు జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సమితిలో (విజయ డెయిరీ) ఎన్నికల నగారా మోగింది. సహకార శాఖ ఎన్నికల అధికారి బీ.హరిబాబు శుక్రవారం ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. 15 మంది బోర్డు సభ్యులు కలిగిన పాలక మండలిలో రోటేషన్ పద్ధతిలో ముగ్గురు సభ్యులకు ఈ నెల 30న పదవీ కాలం ముగియనుంది. వీరిలో అన్నంరెడ్డి వరదారెడ్డి (మనుబోలు మండలం మడమనూరు), ఇసనాక సునీల్‌కుమార్‌రెడ్డి (కొడవలూరు మండలం యల్లాయపాళెం), పెద్దిరెడ్డి శ్రీనివాసులరెడ్డి (దుత్తలూరు మండలం సోమలరేగడ)లు ఉన్నారు. దీంతో ఈ మూడు బోర్డుసభ్యుల పదవులకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 23న నామినేషన్ల స్వీకరణ, 24న ఉపసంహరణ ఉంటుంది. పోటీ ఉన్నట్లయితే 28న ఎన్నికలు జరుగుతాయి. అదేరోజు ఫలితాలు విడుదల చేయనున్నట్లు ఎన్నికల అధికారులు హరిబాబు, శివయ్య తెలిపారు.

● టీడీపీ నేతల వ్యూహం

వైసీపీ హయాంలో ఆ పార్టీ మద్దతుదారులే డైరెక్టర్లుగా కొనసాగారు. అయితే, ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక తొలిసారిగా డెయిరీలో ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఖాళీ అవుతున్న డైరెక్టర్ పదవులను కైవసం చేసుకొనేందుకు టీడీపీ నేతలు పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఇప్పటికే కొందరు మాజీ డైరెక్టర్లు నాయకులు ఈ పదవుల కోసం అన్ని ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం.



టీపీగూడూరు : మహిళలకు కరపత్రాలు అందజేసి నమస్కరిస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

ఊరూరా 'ఇది మంచి ప్రభుత్వం'

కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఇప్పటిదాకా సాగిన పాలనను వివరిస్తూ అధికారులు, నాయకులు ప్రజలకు కరపత్రాలు అందజేశారు. ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. తొలిరోజున ఊరూరా ఎమ్మెల్యేలు, అధికారులు ప్రతి ఇంటి గడపకు చేరుకుని కరపత్రాలు అందజేశారు.

హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా ఉద్యోగోన్నతి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 20 : ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న 24 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు ఎస్పీ జీ కృష్ణకాంత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

23లోగా ఈకేవైసీ చేసుకోవాలి

● 30న ఆర్బీకేలలో తుదిజాబితా ప్రచురణ : జేసీ

నెల్లూరు (వ్యవసాయం) : వ్యవసాయ, ఉద్యాన రైతులందరూ ఈ నెల 23వ తేదీలోగా పంటల నమోదుతోపాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-పంట, ఈకేవైసీల నమోదు ప్రక్రియపై కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో జేసీ సమీక్షించారు. జిల్లాలో ఈ-పంట నమోదు నూరు శాతం చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా ఈకేవైసీకి చేసేందుకు అధికారులకు సహకరించాలని రైతులను కోరారు. ప్రభుత్వ రాయితీలు పొందాలంటే ఈ రెండు ఎంతో ముఖ్యమని వెల్లడించారు. ఈ నెల 24వ తేదీ వరకు గ్రామాల్లో ఈ-పంట నమోదు జాబితా ప్రదర్శనతోపాటు గ్రామసభలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. 25 నుంచి 28వరకు సోషల్ ఆడిట్ గ్రీవెన్స్ అనంతరం 30వతేదీ రైతు సేవా కేంద్రాల్లో తుది జాబితా ప్రచురించాలని తెలియజేశారు. ఈ సమీక్షలో జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి, ఉద్యాన శాఖాధికారి సుబ్బారెడ్డి, డ్వామా పీడీ శ్రీనివాసరావు, జిల్లా సహకారశాఖాధికారి గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూ కల్తీ..

కమీషన్లకు కక్కుర్తి పడే!

● టీడీపీ నేత ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్

● నెల్లూరులో వినూత్న నిరసన





శ్రీవారి పటానికి హారతి ఇస్తూ, లడ్డూను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 20 : తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు వాడారన్న అభియోగాలపై సుప్రీం కోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నెల్లూరులోని గాంధీబొమ్మ కూడలిలో టీడీపీ నేత ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి చిత్రపటానికి హారతులిస్తూ శ్రీవారి లడ్డూను ప్రదర్శించారు. అనంతరం ప్లకార్డులు చేతబట్టి వైసీపీ నేతల తీరును విమర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉచ్చి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకున్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కమీషన్లకు కక్కుర్తి పడి శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి కలపడం దుర్మార్గమని మండిపడ్డారు. దీనివెనుక గూడుపుఠాణి వెలుగులోకి రావాలంటే సీబీఐతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అలాగే, హిందువుల మనోభావాలను దెబ్బతీసిన ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కప్పిర శ్రీనివాసులు, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, అర్చక సమాఖ్య నాయకులు, మాజీ కార్పొరేటర్లు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దర్యాప్తు జరిపించాలి

నెల్లూరు (హరనాథపురం) : శ్రీవారి లడ్డూలో జంతువుల కొవ్వు ఉపయోగించిన విషయమై ఉన్నస్థాయి దర్యాప్తు సంస్థతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ నవ నిర్మాణ సేన నాయకులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకుడు తాళ్లూరు రాము మాట్లాడుతూ తిరుమల లడ్డూ అపవిత్రతకు పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో లవన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్కాట్ కుమార్, కన్నా వినోద్, విజయసూర్య, క్రాంతి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న నవనిర్మాణసేన నాయకులు

బాబాయ్, అబ్బాయిలపై చర్యలు తీసుకోవాలి



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : శ్రీవారి లడ్డూలో వినియోగించే నెయ్యిలో చేపనూనె, జంతువుల కొవ్వును వినియోగించడం దుర్మార్గమని, ఇందుకు కారణమైన బాబాయ్, అబ్బాయిలపై విచారించి చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి డిమాండ్ చేశారు. శుక్ర వారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేక రులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన లడ్డూ తయారీలో జరిగిన అవకతవకలపై ఆందోళన చెందుతూ సీఎం చంద్రబాబు మాట్లాడటం శ్రీవారిని కొలిచే ప్రతి ఒక్కరూ ఆందోళన చెందేలా ఉందన్నారు. ఇందుకు కారకులైన ఎవరినీ విడిచిపెట్టకుండా శిక్షించాలని డిమాండ్ చేశారు.

హిందువులకు క్షమాపణ చెప్పాలి

నెల్లూరు (సాంస్కృతికం) : వైసీపీ నాయకులు అందరూ హిందువులకు క్షమాపణ చెప్పాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షుడు ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్ డిమాండ్ చేశారు. శ్రీవారి లడ్డూను జంతువుల కొవ్వుతో కల్తీ అయిన ఆవునెయ్యితో తయారు చేసి హిందూ మనోభావాలను దెబ్బతీశారని మండిపడ్డారు. కల్తీ నూనెతో లడ్డూ చేసేందుకు అనుమతి ఇచ్చిన ఆనాటి వైసీపీ మంత్రి మండలిపై న్యాయపరంగా విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

జిల్లాలో 545 మంది టీచర్లకు సర్దుబాటు

237 పోస్టుల మిగులు

విధుల్లో చేరేందుకు ఉపాధ్యాయుల విముఖత

తమ ఇబ్బందులు పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి

తీరని 'సర్దుబాటు' కష్టాలు

క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా, అధ్యయనం చేపట్టకుండా చేసిన సర్దుబాటు ప్రక్రియపై నేటికీ అభ్యంతరాలు, సవరణలతోనే గడిచిపోతున్నాయి. తొలుత మండల, డివిజన్ స్థాయిల్లోనే కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించి ఎస్ఏ, ఎస్జీటీ పోస్టులను సర్దుబాటు చేశారు. వీటిలో 40 శాతం మంది విధుల్లో చేరేందుకు విముఖత వ్యక్తం చేస్తూ విద్యాశాఖాధికారులకు వినతులు అందిస్తూనే ఉన్నారు. దీనిపై అధికారులు పునః పరిశీలన చేసి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 20 : ప్రభుత్వ బడుల్లో బోధన సరిగా లేదని, ఉపాధ్యాయుల కొరత ఉందని అత్యధిక శాతం మంది తల్లిదండ్రుల తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు చదువులు మధ్యలోనే ఆపేస్తున్నారు. ఈ సమస్యలన్నీ అధిగమించేందుకు మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి పాఠశాలలను పటిష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల నిష్పత్తి ప్రకారం టీచర్లను గుర్తించి, అదనంగా ఉన్నవారిని కొరత ఉన్న పాఠశాలల్లో సర్దుబాటు చేపట్టారు. ఈ విద్యాసంవత్సరం వరకు సర్దుబాటు అయిన పాఠశాలల్లో బోధించాల్సి ఉంది. గతంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం లోనే నిర్వహించే సర్దుబాటు కౌన్సెలింగ్‌ను ఈసారి ఆయా మండల విద్యాశాఖ కార్యాలయాల్లోనే నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 782 మంది మిగులు టీచర్లలో 545 మందిని సర్దుబాటు (358 పాఠశాలల్లో) చేయగా 237 మంది మిగిలిన సర్‌ప్లస్ టీచర్లను జిల్లాస్థాయిలో జరిగే సర్దుబాటు ప్రక్రియలో సర్దుబాటు చేస్తామని తెలిపారు. అయితే సర్దుబాటు ప్రక్రియ పూర్తయిన తరువాత జిల్లా కేంద్రంలో కొందరు ఉపాధ్యాయులు విధుల్లో చేరేందుకు పేచీ పెడుతున్నారు.



● సర్దుబాటు కష్టాలు

విద్యాశాఖ చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు గందరగోళంగా మారిందని ఉపాధ్యాయులు, సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అనేక డివిజన్లలో అనేకమంది ఉపాధ్యాయులను నాలుగు మండలాలు దాటి సర్దుబాటు చేశారని, దీనికారణంగా అందరూ ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆవేదన చెందుతున్నారు. అనారోగ్య పరిస్థితులు, వృద్ధ తల్లిదండ్రులు కలిగిన ఉపాధ్యాయులు, చిన్నపిల్లలు ఉన్నవారు, అనారోగ్యంతో ఉన్నవారు ప్రయాణ సౌకర్యంలేని మారుమూల ప్రాంతాలకు ఎలా వెళ్లగలరని ప్రశ్నిస్తున్నారు. ఏడాది మధ్యలో పాఠశాలలను మార్పుచేసి కిలోమీటర్ల దూరం ప్రయాణించాలంటే ఇబ్బందులు తప్పవని పేర్కొంటున్నారు. దీనిపై ఇప్పటికే డీఈవోకు విజ్ఞప్తులు అందజేశామని, వెంటనే స్పందించి అసంబద్ధ సర్దుబాట్లను సరిచేసి న్యాయం చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరిస్తున్నారు.

● అంతా ఆన్‌లైన్‌లోనే..

అయితే, దీనిపై విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ సర్దుబాటు అంతా రాష్ట్రస్థాయిలో ఆన్‌లైన్‌లో జరిగినట్లు చెబుతున్నారు. అందరూ ఆమోదించాకే విద్యాశాఖ నుంచి విధుల్లో చేరేందుకు ఉత్తర్వులు వచ్చాయన్నారు. టీచర్ల వినతులను ఉన్నతాధికారులకు పంపిస్తామని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తున్నారు.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి

● డీఈఓకు ఏపీటీఎఫ్ నేతల వినతి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

నెల్లూరు (విద్య) : పని సర్దుబాట ప్రక్రియలో ఎస్జీలను హైస్కూళ్లను సర్దుబాటు చేసినందున ప్రాథమిక పాఠశాలల్లో అనేక ఖాళీలు ఏర్పడ్డాయని, వీటిని వెంటనే భర్తీ చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎ.సురేంద్ర రెడ్డి కోరారు. నగరంలోని డీఈవో కార్యాలయంలో శుక్రవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓ రామారావుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్జెక్ట్ వారీగా 300 మందితో సీనియారిటీ జాబితాలు తయారు చేసి డీఎస్సీ వారీగా అన్ని లిస్ట్‌లను మెరిట్ కమ్ రోస్టర్ ప్రకారం రీ ఆర్గనైజ్ చేయాలన్నారు. దసరా సెలవులు పూర్తయ్యేలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. అదేవిధంగా సమగ్రశిక్ష, డీఈఓ కార్యాలయాల్లో అనధికారికంగా పనిచేస్తున్న వారిని పాఠశాలలకు పంపించాలని, ఖాళీలను నోటిఫికేషన్ ద్వారా పారదర్శకంగా భర్తీ చేయాలన్నారు. పొదలకూరు మండలంలో ఎస్జీటీల సర్‌ప్లస్ జాబితాలో జరిగిన అవకతవకలను సరిచేసి ఎస్జీటీల పని సర్దుబాటును పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పిచ్చిబాబు, నేతలు కృష్ణారెడ్డి, ఎస్‌డీ.జుల్ఫికర్ అలీ, ఎ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

15 రోజులే గడువు..

పురోగతి లేకుంటే సస్పెండ్ చేస్తా!

● జగనన్న కాలనీ ఇళ్ల సమీక్షలో కలెక్టర్ ఆగ్రహం



అధికారులపై మండిపడుతున్న కలెక్టర్

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 20 :'మీకు 15 రోజుల టైం ఇస్తున్నా. ఈలోపు నాకు పురోగతి కనిపించాలి. ఇప్పుడు చెప్పిన మాటలే 15 రోజుల తరువాత చెప్తే అందరినీ సస్పెండ్ చేస్తా!'నంటూ గృహ నిర్మాణ శాఖ అధికారులపై కలెక్టర్ ఓ ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సూర్యతేజతో కలిసి సిటీ, రూరల్ ప్రాంతాలలోని జగనన్న కాలనీలపై కలెక్టర్ సమీక్షించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. జగనన్న కాలనీల్లోని ఇళ్లకు మౌలిక సదుపాయాలు ఎందుకు కల్పించలేకపోతున్నారంటూ కలెక్టర్ ఒక్కో అధికారిని నిలదీశారు. ప్రాజెక్టు మొదలుపెట్టిందెప్పుడు? ఇప్పటి వరకు మీరేం పురోగతి చూపారు? ఎందుకింత నిర్లక్ష్యంగా ఉన్నారు? అంటూ మండిపడ్డారు. 'ఈ రోజు నుంచి 15 రోజుల్లో పురోగతి చూపలేకపోతే మిమ్మల్ని సస్పెండ్ చేయడం తప్ప మరోమార్గం లేదు. 15 రోజుల తరువాత మళ్లీ సమీక్ష నిర్వహిస్తా. జరిగిన పనులు ఆ రోజు చెప్పండి.' అంటూ సూచించారు. అలాగే కాలనీల్లో వాహనాలు వెళ్లేందుకు రోడ్లు సరి చేయాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీకి 10 బృందాలు

నెల్లూరు(వైద్యం): జిల్లాలో ఉన్న అన్ని స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసేందుకు 10 మంది ప్రోగ్రాం అధికారులతో బృందాలను నియమించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం ప్రకారం ఏ స్కానింగ్ సెంటర్‌నూ లింగని ర్ధారణ చేయరాదన్నారు. 10 రోజులలో ఆయా బృందాలు స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఒకవేళ స్కానింగ్ కేంద్రాలు తప్పు చేసినట్లు తనిఖీలో వెల్లడైతే వాటిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలకు మార్గదర్శకాలు విడుదల

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 20 : రిజిస్ట్రేషన్లు-స్టాంపుల శాఖలో ఉద్యోగులు, అధికారుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా శుక్రవారం మార్గదర్శకాలను విడుదల చేశారు. ఒకే స్థానంలో రెండేళ్ల విధులు నిర్వహించిన వారిని బదిలీకి అర్హులుగా పేర్కొన్నారు. బదిలీలకు జీరో సర్వీసు వర్తింపచేయాలని ఆ శాఖకు చెందిన ఉద్యోగుల యూనియన్ తీవ్రంగా ప్రయత్నం చేసినట్లు సమాచారం. కానీ, రెండేళ్ల సర్వీసును ప్రాతిపదికగా తీసుకుని బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

బయో వ్యర్థాలను కాలువల్లో కలపొద్దు

- నీటీ శుద్ధి కాంట్రాక్టర్‌ను మార్చండి
- జీజీహెచ్ పరిశీలనలో కలెక్టర్ ఆనంద్



రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 20 : బయో మెడికల్ వ్యర్థాలను కాలువల్లో కలుపకూడదని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఆనంద్ వైద్యాధికారులను హెచ్చరించారు. శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. రోగుల ఓపీ స్లిప్పులను, డేటా ఎంట్రీని పరిశీలించారు. ఆసుపత్రిలోని పలు విభాగాలను సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్య చికిత్సలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఐసీఐసీఐ బ్యాంక్, సీఎస్ఆర్ నిధులు రూ.25 లక్షలతో ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్లడ్ కాంపొనెంట్ సెపరేటర్ యూనిట్‌ను ఈ సందర్భంగా కలెక్టర్ ప్రారంభించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడారు. మున్సిపాలిటీ సేకరించే సాధారణ చెత్తలో బయో మెడికల్ వ్యర్థాలు ఎలాంటి పరిస్థితిలో ఉండరాదని ఆదేశించారు. మురికి నీటి శుద్ధికి సంబంధించి ఏడాది క్రితం కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తి అక్కడ ఒక్క పనికూడా చేయలేదని, ఈ నేపథ్యంలో మరలా టెండర్ పిలిచి కొత్త వ్యక్తులకు కాంట్రాక్ట్ ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యశ్రీ కేసుల సంఖ్య 60శాతమే ఉందని దీన్ని 100 శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు మధ్య సరైన అవగాహన లేదని, దీనిని సరిదిద్దుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని చురకలంటించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్, వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ గోవింద్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ కళారాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

నగరవనం పనులు త్వరగా పూర్తి చేయండి

- గుంటూరు రేంజ్ సీసీఎఫ్ శ్రీనివాసరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీసీఎఫ్ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు (వెంకటేశ్వర పురం), సెప్టెంబరు 20 : నెల్లూరు నగర శివార్లలో రూపుదిద్దుకొంటున్న నగర వనం పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని గుంటూరు రేంజ్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన ముందుగా నగర వనంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అటవీ శాఖ జిల్లా కార్యాలయంలో అధికారులతో సమీక్ష జరిపారు. జిల్లాలోని కావలి, వెంకటాచలం, పెంచలకోన, సిద్దవరంలో ఏర్పాటు చేస్తున్న నగర వనాలను కూడా త్వరితగతిన పూర్తిచేయా లన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్, శ్రీనివాసులు రెడ్డి, స్క్వాడ్ డీఎఫ్‌వో మారుతీ ప్రసాద్, నెల్లూరు రేంజర్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లు, మద్యం షాపులే లక్ష్యంగా చోరీలు

- నలుగురు నిందితుల అరెస్ట్
- రూ. 6 లక్షల సొత్తు స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నెల్లూరు రూరల్, సెప్టెం బరు 20 : నెల్లూరు రూరల్ తో పాటు వెంకటాచలం, వేదాయపాళెం, దర్గామిట్ట, పొదల కూరు, మనుబోలు స్టేషన్ల పరిధిలో తాళం వేసిన ఇళ్లు, మద్యం షాపులే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ముఠాను నెల్లూరు రూరల్ పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి రూ. 6 లక్షల సొత్తు, చోరీలకు ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రూరల్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్ఐ బీ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ శ్రీనాథ్ వివరాలు వెల్లడించారు. నెల్లూరుకు చెందిన కంచు సురేష్, పొలాని కిషోర్, గుండ్రాగి సిద్దు, బుజబుజ నెల్లూరుకు చెందిన నాట్‌పెరుమాళ్, కంచు విష్ణు ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నార ని తెలిపారు. వారిలో కంచు విష్ణు పరారీలో ఉండగా మిగిలిన వారిని అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి 3 కేజీల వెండి, ఒక బైకు, మూడు ల్యాప్‌ట్యాప్‌లు, రూ. 60 వేల నగదు, ఒక సెల్‌ఫోన్, ఒక క్యాష్‌చెస్ట్‌బాక్స్, నేరాలకు ఉపయోగించిన రెండు కత్తులు, ఒక గడ్డపారను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

నిరసన కొనసాగిస్తాం : పీహెచ్‌సీల వైద్యులు

నెల్లూరు(వైద్యం): జీవో నెంబరు 85 రద్దు కోరుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు చేపట్టిన నిరసన కొనసాగుతోంది. తమ డిమాండ్లు నెరవేరే వరకు నిరసన కొనసాగిస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్యకు ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్ అసోసియేషన్ నేతలు శుక్రవారం వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలియచేస్తు న్నప్పటికీ ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేదన్నారు. అసోసియేషన్ నేతలు రవీంద్రనాధ్‌రెడ్డి, దర్మేంద్ర, అహ్మద్‌బాబు, బాలచంద్ర బాబు, శాంతి, రమాకుమారి, భానుప్రియ పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యదర్శిగా ఫజులుల్లాహ్

నెల్లూరు సిటీ, సెప్టెంబరు 20 : నెల్లూరు కార్పొరేషన్ కార్యదర్శిగా ఫజులుల్లాహ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన నెల్లూరుకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కమిషనర్ సూర్యతేజను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

యువకుడి అదృశ్యం

నెల్లూరు(క్రైం) సెప్టెంబరు 20: అప్పులపాలైన ఓ యువకుడు ఇంటి నుంచి అదృశ్యం కావడంపై నెల్లూరులోని నవాబుపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని వెంకటేశ్వరపురంలో పుష్పాంజలి కుటుంబం నివసిస్తోంది. ఆమె కుమారుడు అభినాష్ బీటెక్ చదివాడు. ఇంటి వద్దనే ఉంటూ స్టాక్ మార్కెట్‌లో డబ్బు పెట్టి నష్టపోయాడు. దీంతో అప్పులపాలయ్యారు. అప్పుల వారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అతని కోసం గాలించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుడి ఆచూకీ తెలిసిన వారు నెం.9440796306కు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్ బాషా కోరారు.

మోటార్ల వైరు చోరీ

వింజమూరు, సెప్టెంబరు 20: మండలంలోని ఊటుకూరు పంచాయతీ తక్కెళ్లపాడు గ్రామంలో గురువారం రాత్రి మోటార్ల వైర్లు చోరీకి గురయ్యాయని రైతులు తెలిపారు. సుమారు 10 మోటార్ల వైరు చోరీకి గురయ్యాయని, వాటి విలువ రూ.30వేలు ఉంటుందన్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా మోటార్ల వైర్లు చోరీకి గురవుతున్నాయని, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా చోరీలు ఆగడంలేదని రైతులు వాపోతున్నారు.

ఆటో, మోటారుబైకు ఢీ : చిన్నారి మృతి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 20: ఆటో, మోటారుబైకు ఢీకొనడంతో ఏడాది పాప మృతిచెందిన సంఘటన గురువారం రాత్రి ఉదయగిరి శివారు ప్రాంతంలోని గండిపాళెం మార్గంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తిరుమలాపురం ఎస్టీ కాలనీకి చెందిన బాలవెంగయ్య, వెంగమ్మలు తమ ఏడాది పాప నాగమణిని వెంటబెట్టుకొని మోటారుబైకుపై ఉదయగిరికి వచ్చారు. పనులు ముగించుకొని పాపను బైకుపై ముందు కూర్చోబెట్టుకొని ఇంటికి వెళుతున్నారు. గండిపాళెం మార్గంలోని వ్యవసాయ కళాశాల సమీపంలో చెక్‌డ్యాం వద్దకు వెళ్లేసరికి ముందుగా వేగంగా వెళుతున్న ఆటోడ్రైవర్ ఆకస్మాత్తుగా బ్రేక్ వేసి ఆటోను రోడ్డుకు అడ్డంగా తిప్పాడు. దీంతో వెనుక వస్తున్న మోటారుబైకు అదుపుతప్పి ఆటోను ఢీకొనడం తో బైకుపై ఉన్న పాప నాగమణి రోడ్డుపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. పాప ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరులో వైద్యశాలకు వెళ్లగా మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. దీంతో పాప మృతదేహాన్ని తిరిగి ఉదయగిరికి తీసుకొచ్చారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పాప మృతదేహానికి పోస్టుమార్టం చేయించి తల్లిదండ్రులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బ్రాయిలర్ లైవ్	120
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	242
లేయర్	195


బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7131
వెండి కిలో ధర	రూ. 91,400
వెండి ఒక గ్రాము	రూ. 94.40

అప్రమత్తతే ఔషధం

- విస్తరిస్తున్న అల్జీమర్స్
- 60 ఏళ్లు దాటితే తస్మాత్ జాగ్రత్త
- మతిమరుపు ముదిరితే మంచానికే..!
- కుటుంబ సభ్యుల సహకారం ముఖ్యం
- జిల్లాలో 85 వేల మందికిపైగా వ్యాధిగ్రస్తులు
- నేడు ప్రపంచ అల్జీమర్స్ డే



నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 20 : మానవ జీవితం జ్ఞాపకాల దొంతర. కొన్ని సంఘటనలు ఎప్పటికీ గుర్తుండి పోతాయి. మరికొన్ని మర్చిపోతాం. జ్ఞాపకాలు లేకపోతే మనసంతా శూన్యమే. అయితే జ్ఞాపకాలే కాదు వాటికి మూలమైన జ్ఞాపకశక్తిని కోల్పోతే ఆ జీవితం అస్తవ్యస్తంగా మారుతుంది. ఇలా జ్ఞాపకశక్తిని కోల్పోవడాన్నే వైద్య పరిభాషలో అల్జీమర్స్ (మతిమరుపు) వ్యాధి అంటారు. ఈ వ్యాధికి అప్రమత్తతమే అసలైన ఔషధం. బాధితులకు కుటుంబ సభ్యుల సహకారం ఎంతో అవసరం. ఈ వ్యాధివచ్చిన వారిని ఒంటరిగా వదలకూడదు. నిర్లక్ష్యం చేస్తే వ్యాధిగ్రస్తుడు మంచానికే పరిమితమయ్యే పరిస్థితి వస్తుంది. కొంత మంది నిద్రలోనే ప్రాణాలు కోల్పోతుంటారు. 1906వ సంవత్సరంలో అల్జీమర్ అనే జర్మనీ న్యూరో పెథాలజిస్ట్ ఈ వ్యాధిని కనుగొన్నాడు. మెదడులోని కొన్ని భాగాలు దెబ్బతినడం వల్ల ఈ వ్యాధి వస్తుందని ఆయన నిర్ధారించారు. ఆయన జ్ఞాపకార్థం సెప్టెంబరు 21వ తేదీని ప్రపంచ అల్జీమర్స్ డే గా ప్రకటించి ప్రజలకు ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలో 85 వేల మందికిపైగా..

అల్జీమర్స్ వ్యాధిగ్రస్తులు జిల్లా వ్యాప్తంగా 85 వేల మందికిపైగా ఉన్నారు. 60 ఏళ్ల నుంచి 75 ఏళ్ల వయసులో ఉన్న వారిలో 10 శాతం మంది, 85 ఏళ్ల పైబడిన వారిలో 50 శాతం మంది ఈ వ్యాధికి గురవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో ఉన్న వారే వ్యాధికి గురవుతున్నారు. దేశంలో 3.7 మిలియన్ల మంది మతిమరుపు వ్యాధిగ్రస్తు లు ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. వ్యాధిగ్రస్తుల సంఖ్య క్రమేపి పెరుగుతోంది. మానసిక ఒత్తిడికి, అల్జీమర్స్‌కు అవినాభావ సంబంధం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. మనిషి ఒత్తిడికి గురైనప్పుడు మెదడులో విషయగ్రహణ చర్యను అడ్డుకునే అల్లోప్రెగనోలోన్ అనే స్టెరాయిడ్స్ స్థాయిలు అధికమవుతాయని, ఈ పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగితే అది అల్జీమర్స్‌కు దారితీస్తుందని అంటున్నారు.

వివిధ దశల

- ప్రారంభ దశలో ఒకటి నుంచి రెండేళ్ల కాలంలో వృద్ధాప్యం వల్ల వచ్చే లక్షణాలు అంతగా కనిపించవు. మాట్లాడటంలో ఇబ్బందులు, ప్రదేశాలు మర్చిపోవడం, మానసిక పరివర్తనలో మార్పులు ఉంటాయి.
- మధ్య దశలో రెండు నుంచి ఐదేళ్లలో వ్యాధి తీవ్రత పెరుగుతుంది. రోజు వారీ పనులు చేసుకోలేకపోవడం స్నాన, మల, మూత్ర విసర్జనకు కుటుంబ సభ్యుల మీద ఆధారపడటం జరుగుతుంది.
- చివరి దశలో ఐదేళ్ల నుంచి మతిమరుపు ఎక్కువగా ఉంటుంది.. తినడానికి, నడవడానికి కూడా ఇబ్బంది పడతారు. మల, మూత్రాలు తెలియకుండా పోతాయి. మంచానికే పరిమితం అవుతారు.

మొదటి దశలోనే జాగ్రత్త పడాలి..

మొదటి దశలోనే అల్జీమర్స్‌ను గుర్తిస్తే వ్యాధితీవ్రతను తగ్గించవచ్చు. పూర్తి నివారణ మాత్రం సాధ్యంకాదు. రక్తం గడ్డకట్టడం, తలకు తీవ్ర గాయం అయినప్పుడు మతి మరపు లక్షణాలు కనిపిస్తే దానిని అల్జీమర్స్‌గా నిర్ధారించరాదు. రక్తంలో సోడియం, క్రియాటినిన్, థైరా యిడ్ మోతాదు తగ్గితే అల్జీమర్స్ వ్యాధి లక్షణాలు బయట పడతాయి. సాధారణ రక్త పరీక్షల ద్వారా వీటి మోతాదును తెలుసు కోవచ్చు, ఎంఆర్ఐ, సిటీస్కాన్ చేయటం వల్ల నిర్ధారణ చేయవచ్చు. వెన్నులోని కొంత నీరు తీసుకుని సీఎస్ఎఫ్ పరీక్ష ద్వారా కూడా వ్యాధిని నిర్ధారించవచ్చు. రోగి రోజూ చేసే పనులను గుర్తుచేసుకునేలా కుటుంబ సభ్యులు సహకారం అందించాలి.

వ్యాధికి కారణాలు

- మద్యపానం, పక్షవాతము
- మెదడు కేన్సర్, ఇన్‌ఫెక్షన్
- శరీరంలో విటమిన్ బీ12 తగ్గడం
- మందుల వల్ల వచ్చే దుష్పరిణామాలు
- థైరాయిడ్, మూత్రపిండాలు, కాలేయ వ్యాధులు

చికిత్స విధానాలిలా..

- ఈ వ్యాధికి పూర్తిస్థాయి చికిత్స లేదు
- కొన్ని మందుల వల్ల కొంతవరకు నయం చేయవచ్చు
- ప్రాథమిక దశలోనే వ్యాధి నిర్ధారణ ముఖ్యం
- తీసుకోవాల్సిన జాగ్రత్తలను రోగితోపాటు కుటుంబ సభ్యులకు వివరించడం.

సూపర్ సిక్స్ అమలు చేశాక

జగన్, కాకాణిని గాడిదపై ఊరేగిస్తాం

- టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అజీజ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్ అజీజ్

నెల్లూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : 'సీఎం చంద్రబాబు అధ్యక్షతన కూటమి ప్రభుత్వం విజయవంతంగా వంద రోజులు పూర్తి చేసుకుంది. దురదృష్టవశాత్తూ ఇరవై రోజులు వరద ప్రాంతాల్లోనే నిమగ్నం కావాల్సి వచ్చింది. వంద రోజులు కూడా కాక ముందే సూపర్ సిక్స్ పథకాలపై విమర్శలు ప్రారంభించారు. మేము ఇచ్చిన హామీల ప్రకారం సూపర్ సిక్స్ అమలు చేశాక వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డిలను గాడిదపై ఊరేగిస్తాం' అంటూ టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ వ్యాఖ్యానించారు. శుక్రవారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాకాణికి వీధి గొడవలు అలవాటని, విపత్కర పరిస్థితుల్లో కూడా వీధి గొడవల్లానే మాట్లాడుతున్నారని విమర్శించారు. అసలు కాకాణి తన స్థితి తెలుసుకొని మాట్లాడుతున్నారా..? అని అజీజ్ ప్రశ్నించారు. వైసీపీ పాలనలో సర్వేపల్లిలో ఒక దళితుడిని, ముస్లింని చంపలేదా..?, ఆక్వా రైతులను ఇబ్బంది పెట్టి రొయ్యలను సముద్రం పాలు చేయలేదా..? అని నిలదీశారు. ప్రజలు కొట్టిన దెబ్బకు జగన్‌తోపాటు వైసీపీ నాయకులకు మతిస్థిమితం లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. రెడ్‌బుక్ అనేది కక్షలు, ప్రతీకారాలు తీర్చుకునేది కాదని, దుర్మార్గాలు, పాపాలు చేసిన వారిని దోషులుగా నిరూపించడమే దాని ఉద్దేశమని చెప్పారు. అక్రమాలకు తావులేకుండా ప్రపంచంలో ఎక్కడి నుంచైనా పర్యవేక్షించే వ్యవస్థను కూటమి ప్రభుత్వం తీసుకొస్తుంటే, వైసీపీ నేతలు మాత్రం దోపిడీ.. దోపిడీ అంటూ విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు జెన్ని రమణయ్య, రాజానాయుడు, నాయకులు జాఫర్ షరీఫ్, మెయినుద్దీన్, పెంచలనాయుడు, జలదంకి సుధాకర్, సాబీర్‌ఖాన్, గంగాధర్, ప్రదీప్, ఎల్సీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి జేవీవీ ప్రతిభ పరీక్షలు



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 20 : ఈ నెల 25వ తేదీ నుంచి జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) చెకుముకి టాలెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆ వేదిక జిల్లా అధ్యక్షుడు ఉదయభాస్కర్ వెల్లడించారు. శుక్రవారం నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు, సైన్స్‌పై మక్కువ పెంచేందుకు చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. 8,9,10 తరగతుల విద్యార్థులకు అన్ని పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీషు మీడియంలో ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. వేదిక జిల్లా కార్యదర్శి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 25న పాఠశాల స్థాయిలో, అక్టోబరు 1వ తేదీన మండల స్థాయిలో, అక్టోబరు 27న జిల్లా స్థాయిలో, నవంబరు 9, 10 తేదీలలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని దశల్లో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు ఇస్తామని వెల్లడించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జట్లను ఎంపిక చేసి పరీక్షలు నిర్వహిస్తామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో విద్యాచరణ్ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంపై రేపు రాష్ట్ర అవగాహన సదస్సు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 20 : ఆంధ్రప్రదేశ్ డయాబెటిక్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులో మధుమేహంపై రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పావులూరి మాధవ్ తెలిపారు. శుక్రవారం నగరంలోని మాధవ్ డయాబెటిస్ ఆసుపత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో 10 కోట్ల మంది మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉన్నారన్నారు. వీరిలో సగం మందికి మధుమేహంపై అవగాహన లేదన్నారు. సదస్సుల్లో మధుమేహం చికిత్సలో ఆధునిక వైద్య విధానాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ రాజారెడ్డి పాల్గొంటారని, దేశ వ్యాప్తంగా ఉన్న వైద్య నిపుణులు హాజరవుతారని తెలిపారు. ఇప్పటికే 500 మంది వైద్యులు పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. అనంతరం రాష్ట్ర సదస్సు ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో సన్‌ఫార్మాకు చెందిన సుబ్రహ్మణ్యం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 20 : స్వయం ఉపాధి రుణాల కోసం విభిన్న ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకోవాలని విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఏడీ వినయ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రూ. లక్ష నుంచి ఐదు లక్షల వరకు 100 మందికి స్వయం ఉపాధి కింద వివిధ పథకాలకు నేరుగా రుణాలు మంజూరు చేయడానికి అక్టోబరు 7వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. వివరాలకు 0861-2329581 నెంబరును సంప్రదించాలని కోరారు.

ఓపెన్‌స్కూల్ దరఖాస్తుకు గడువు పొడిగింపు

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 20 : సార్వత్రిక విద్యాపీఠం(ఏపీ ఓపెన్‌స్కూల్)2024-25 విద్యాసంవత్సరానికి టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు గడువు పొడగించి నట్లు డీఈవో రామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యాసకులు ఈనెల 28వతేదీ వరకు సాధారణంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 29వతేదీన అడ్మిషన్ ఫీజుతోపాటు రూ.200 అపరాధ రుసుము చెల్లించి దరఖాస్తు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌నుగానీ, సమీపంలోని ఓపెన్‌స్కూల్ అధ్యయన కేంద్రాన్నిగానీ సంప్రదించాలని కోరారు.

రేపు ఫుట్‌బాల్ మహిళల జిల్లా జట్టు ఎంపిక

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 20 : జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సీనియర్ మహిళల ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి బీ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారిణులు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో సంబంధిత తేదీలో ఉదయం 7 గంటలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన జట్టు విజయవాడలో ఈనెల 24 నుంచి 26వతేదీ వరకు జరిగే రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440742002 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు..

జిల్లా పాఠశాలల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో శనివారం మహ్మదాపురం జడ్పీ పాఠశాలలో అండర్-17 బాల, బాలికల ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు క్రీడాసమాఖ్య కార్యదర్శి ఎస్ విజయ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2008 జనవరి 1వతేదీ తర్వాత జన్మించిన వారు అర్హులని, ధ్రువీకరణ పత్రంతో సంబంధిత తేదీలో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9440741176, 9948551484 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

నుడా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి : ఇన్‌చార్జి వీసీ సూర్యతేజ



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యతేజ

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 20: స్వర్ణాంధ్ర 2024 విజన్‌ప్లాన్‌ను సిద్ధం చేయాలని నుడా అధికారులను ఇన్‌చార్జి వీసీ సూర్యతేజ ఆదేశించారు. నుడా కార్యాలయంలో ఆయన శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. నెల్లూరు నగర పరిసర ప్రాంతాలను ఆధునిక హంగులతో, నివాస యోగ్యంగా తీర్చిదిద్దేందుకు వీలుగా మాస్టర్ ప్లాన్‌ను తయారుచేయాలన్నారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుని ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నుడా కార్యదర్శి లక్ష్మీ, పరిపాలనాధికారి ఈశ్వర్‌రాజు. ప్లానింగ్ అధికారి సుబ్బారావు, ఈఈ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు సజ్జలు కొనుగోలు చేస్తాం

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 20 : సజ్జలను మద్దతు ధర కంటే తక్కువగా కొనుగోలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్ ధర నాణ్యతను బట్టి క్వింటాను రూ.2200 నుంచి రూ.2500 వరకు ఉందని, వ్యాపారులు కూడా అదే ధరకు కొనుగోలు చేస్తున్నట్లు తమ విచారణలో తెలిసిందన్నారు. ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని సీతారామపురం, మర్రిపాడు, దుత్తలూరు మండలాల్లో 962 ఎకరాల విస్తీర్ణంలో సజ్జ పంట సాగు చేస్తున్నారని, ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని తెలిపారు.

అమ్మవారి ఆలయాలకు సారె పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం): జిల్లాలోని 108 అమ్మవారి ఆలయాలకు పసుపు, కుంకుమ, ధూప దీప నైవేద్య సామగ్రితో సారెను శుక్రవారం నగరంలోని కాశీనాయన ఆశ్రమంలో పంపిణీ చేశారు. దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రామచంద్ర నాయన స్వామి ఆశీస్సులతో ఏడేళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆశ్రమ సేవకుడు ధన్వి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణకు కాశీనాయన, సత్యసాయి భక్తులు , ఎయిడ్ ఇండియా ఫౌండేషన్ సహకారం అందించాయని తెలిపారు. కార్యక్రమంలో సంతోష్ శర్మ, మహంకాళి వెంకటేష్, బాణాల నాగూర్, సిద్దు, వైష్ణవి, వెంకటేష్, మాధవరావు పాల్గొన్నారు.

బాలకార్మికులు తల్లిదండ్రులకు అప్పగింత

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 20 : ఈనెల 13న ఒడిశా నుంచి చెన్నైకు తరలిస్తుండగా అధికారులు సంరక్షించిన 11 మంది బాలకార్మికులను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. రైలులో తరలిస్తున్న పిల్లలను సంరక్షించిన అధికారులు వారిని బాలసదన్, క్యాప్ బాయ్స్ హాస్టల్‌లో చేర్పించారు. తల్లిదండ్రుల వివరాలు తెలుసుకుని వారిని నెల్లూరుకు పిలిపించి పిల్లలను అప్పగించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేన సుజన్, డీసీపీవో సురేష్ పాల్గొన్నారు.

పరిహారం అందేదెన్నడు.. వెతలు తీరేదెప్పుడు?

- 18ఏళ్లుగా ఎదురుచూపు



ముత్తుకూరు, సెప్టెంబరు 20: పద్దెనిమిదేళ్లుగా కృష్ణపట్నం ఉప్పు రైతులు పరిహారం కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. కృష్ణపట్నం పోర్టు అభివృద్ధి కోసమని 2006లో కృష్ణపట్నం సాల్ట్ సొసైటీ పరిధిలోని 970 ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో పోర్టు అభివృద్ధికి గోపాలపురం పరిధిలోని ఈ భూములు అవసరమని పోర్టు నిర్వాహకులు భావించారు. అయితే అప్పట్లో సాల్ట్ సొసైటీ ఈ భూములకు బదులుగా మరో ప్రాంతంలో ఏర్పాటే చేయాలని భావించడంతో ఉప్పు భూముల సమస్య పెండింగ్‌లో పడింది. అనంతరం ఉప్పు భూములకు ధర చెల్లించి స్వాధీనం చేసుకునేందుకు పోర్టు యాజమాన్యం సంసిద్ధత వ్యక్తం చేసింది. అయితే పరిహారం ఇచ్చేదాకా తమ భూములను అప్పగించబోమని ఉప్పు రైతులు తేల్చి చెప్పారు. ఆ భూముల్లో ఉప్పు పండిస్తూ కొద్ది సంవత్సరం జీవనం సాగించారు. బొగ్గు కాలుష్యంతో ఉప్పు పాడైపోతుండడంతో రైతులకు కొంతకాలం పోర్టు యాజమాన్యం నష్ట పరిహారం చెల్లిస్తూ వచ్చింది. ఆ తర్వాత మార్కెట్ ధర ప్రకారం భూముల ధర నిర్ణయించి, ఆ మొత్తాన్ని ప్రభుత్వంకి చెల్లించామని, కృష్ణపట్నం పోర్టు ఉప్పు భూముల్లో తమ కార్యకలాపాలు ప్రారంభించారు. అప్పటి నుంచి భూముల పరిహారం సమస్య అపరిష్కృతంగానే ఉంది. కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం నవయుగ చేతి నుంచి అదాని కంపెనీకి మారడంతో ఉప్పు భూముల పరిహారం విషయం కొలిక్కి వస్తుందని అంతా భావించారు. ఎన్నో ఏళ్లుగా తాము చూస్తున్న పరిహారం చేతికందుతుందని అనుకున్నారు. అయితే అదానీ కంపెనీ యాజమాన్యం మారి నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ భూముల పరిహారం సమస్య కొలిక్కిరాలేదు. ఉప్పు రైతులకు పరిహారం చెల్లించడంతో పాటు ఉప్పు భూములపై ఆధారపడి జీవిస్తున్న వేలాదిమంది కార్మికులకు ఉపాధి కల్పిస్తామన్న పోర్టు యాజమాన్యం హామీ అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా ఉప్పు రైతుల సమస్యను పరిష్కరించి పరిహారం చెల్లించాలని ఉప్పు భూములపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులను ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

రికవరీ ఆదేశాలు సరే..

నగదు ఎవరు చెల్లించాలి!

- మండలంలో తొలిసారిగా రూ.97.26లక్షల రికవరీకి ఆదేశాలు
- క్షేత్ర సహాయకుడు, ఈసీ, టీఏలే ప్రధాన బాధ్యులు
- పర్సనల్ హియరింగ్ తర్వాతే కొలిక్కివచ్చే అవకాశం


బహిరంగ విచారణ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

కొండాపురం, సెప్టెంబరు 20: కేంద్ర ఉపాధిహామీ పథకం దోచుకున్న వారికి దోచుకున్నంత అన్న చందంగా మార్చుకున్నారు కొందరు. తామేం చేసినా చెల్లుతుందంటూ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. పేదలకు దక్కాల్సిన నిధులు పక్కదోవ పడుతున్నాయి.

మండలంలో 15వేలపైగా జాబ్‌కార్డులు

19పంచాయతీల్లో 15వేలకుపైగా జాబ్‌కార్డులున్నాయి. ఒక్కొక్క జాబ్‌కార్డులో నలుగురు కుటుంబసభ్యులు ఉంటారు. వీరందరికీ కలిపి ఏడాదిలో 100రోజుల పనిదినాలు కల్పించి వారికి సగటున రూ.25వేల వరకు నగదును నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారు. 2023 ఏప్రిల్ నుండి 2024 మార్చి వరకు మండలంలో 533 పనులు చేపట్టి రూ.16కోట్ల నిధులు ఖర్చు చేశారు. ఈ పనులకు సంబంధించి జరిగిన తనిఖీలో విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. ఆయా గ్రామాల క్షేత్ర సహాయకులు గ్రామంలో లేకున్నా అనుకూనంగా వారి పేర్ల మీద పని కల్పించినట్లు మస్టర్లు వేసుకొని నగదును వారి ఖాతాలకు జమ చేయించి పంచుకున్నట్లు ఇటీవల జరిగిన సామాజిక తనిఖీలో బహిర్గతమయ్యింది. అలాగే చదువుకున్న వారు కూడా మస్టర్లలో వేలిముద్రలు వేసి ఉండటం, ఒకరే అన్ని సంతకాలు చేసి ఉండటం వంటి పొరపాట్లను గుర్తించారు. ముఖ్యంగా కొలతల్లో వ్యత్యాసాలను సిబ్బంది గుర్తించారు. ఈసీ, టీఏ, క్షేత్ర సహాయకులు వారికి ఇష్ట మొచ్చినట్లు వ్యవహరించారని గుర్తించారు. కుటుంబంలో ఒక్కొక్కరికీ ఒక్కొక్క జాబ్‌కార్డు ఉండటం, పెండింగ్ కానివారికి జాబ్‌కార్డులు ఏర్పాటు చేయడం వంటి సమస్యలను గుర్తించారు. ఈ విధంగా మండలంలో రూ.6కోట్ల వరకు అవకతవకలు జరిగాయని తనిఖీ సిబ్బంది గ్రామాల్లో గుర్తించారు. బహిరంగ విచారణలో అధికారులు కేవలం రూ.97.26లక్షల వరకే రికవరీకి ఆదేశించారు. ఈ రికవరీని ఎవ్వరు చెల్లించాలన్నదే ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికీ 16విడతలుగా తనిఖీ బహిరంగ విచారణ జరగ్గా ఇంతమొత్తంలో రికవరీకి ఆదేశంచడం ఇదే ప్రథమం.

జిల్లాస్థాయి పర్సనల్ హియరింగ్ తర్వాతనే తేలుతుంది

బహిరంగ విచారణ అనంతరం త్వరలో జిల్లాస్థాయిలో పర్సనల్ హియరింగ్ ఉంటుంది. అక్కడ సిబ్బందిని విచారించి ఎవరు నగదు రికవరీ చేయాలో ఆదేశాలివ్వడం జరుగుతుంది. వారి ఆదేశాల ప్రకారం రికవరీ నగదు చెల్లించాల్సి ఉంటుంది.

\- చెంచయ్య, ఏపీవో, కొండాపురం

వరద బాధితులకు ఆర్థికసాయం


ఇంటూరికి చెక్కు ఇస్తున్న బ్రహ్మారెడ్డి

ఉలవపాడు, సెప్టెంబరు 20: విజయవాడ వరద బాధితుల సహాయార్థం బద్దిపూడి టీడీపీ సీనియర్ నాయకులు కూనం బ్రహ్మారెడ్డి రూ.50వేలు, ఉలవపాడు జూనియర్ కాలేజి విద్యార్థులు, అధ్యాపకులు రూ.20,050, టీడీపీ నాయకులు బండి తిరుపతిరెడ్డి రూ.10వేలు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావుకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు లావణ్య, సర్పంచ్ చేవూరి వెంకటేశ్వర్లు, పార్టీ మండలాధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు, కన్నాప్రసాదు, పోలు బోయిన శ్రీనివాసులు, చెంచురామిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం గుండెపోటుతో మరణించిన పార్టీ సీనియర్ నాయకులు గొల్లపోతు జాలయ్య కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అల్లూరు : విజయవాడ వరద బాధితులకు తమవంతు ఆర్థికసాయం అందించేందుకు అల్లూరు విక్రమ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ముందుకొచ్చారు. శుక్రవారం పాఠశాల సిబ్బంది, విద్యార్థులు సమకూర్చిన రూ.36వేలను అపస్మా ప్రతినిధులు శివకుమార్, రాధాకృష్ణలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయసులో చిన్నవారైనా వారు చేసిన సహాయం పెద్దదని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వంశీ ఉన్నారు.

నేడు గుడ్లూరులో ప్రజావేదిక


గుడ్లూరు, సెప్టెంబరు 20: వందరోజుల కొత్త ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ఇంటింటికి తెలియజేసే ప్రజావేదికను మండలకేంద్రంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు టీడీపీ మం డలాధ్యక్షుడు నాగరాజు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు హాజరవుతారని తెలిపారు.

కలువాయి : బ్రాహ్మణపల్లిలో ఉదయం 10గంటలకు జరిగే ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హాజరవుతారని టీడీపీ మండల కన్వీనర్ గోనుగుంట వెంకటేశ్వర్లు తెలిపారు. మారంరెడ్డిపల్లి పంచాయతీలోని ఎస్సీ కాలనీలో శనివారం జరుగు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ముఖ్య అతిథిగా హాజరవుతారని మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు తెలిపారు.

నిమిషం ఆలస్యమైనా చర్యలు

వలేటివారిపాలెం: విధులకు నిమిషం ఆలస్యమైనా చర్యలు తప్పవని నోడల్ ఆఫీసర్ మల్లికార్జున హెచ్చరించారు. చుండి మోడల్‌స్కూల్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. టీచర్లు ఏ సమయానికి విధులకు హాజరయ్యారో ప్రిన్సిపాల్ వెంకటేశన్‌ను అడిగి తెలుసున్నారు. బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు.

కందుకూరు ఎస్ఐగా సాంబయ్య



కందుకూరు, సెప్టెంబరు 20: పట్టణ ఎస్ఐగా సాంబయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో వలేటివా రిపాలెం ఎస్ఐగా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన సీఐ కె.వెంకటేశ్వరరావును కలిసి పుష్పగుచ్ఛం అంద జేశారు.

ఆత్మకూరు: ఆత్మకూరు మరో ఎస్ఐగా సాయిప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాని ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించేవారు.

అందుబాటులో ఉండి సేవలందిస్తాం

జలదంకి, సెప్టెంబర్ 20: కొందరు వ్యక్తిగతంగా కక్ష పెంచుకుని విమర్శలు చేస్తున్నారే తప్ప, వైద్యుడిగా తాను సిబ్బంది ఆరోగ్యకేంద్రానికి వారికి అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల కాలంలో డాక్టర్లు, సిబ్బంది పనితీరు బాగోలేదన్న ఆరోపణలపై ఆయన స్పందిస్తూ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. గ్రామాల ప్రజలు ఎవరూ ఆరోపణలు నమ్మవద్దన్నారు.

దోమల నివారణ చర్యలు తీసుకోవాలని వినతి

కావలి టౌన్, సెప్టెంబరు 20: పట్టణంలో దోమల నివారణ చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచులయ్య, నాయకులతో కలిసి శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. దోమల నియంత్రణ లేకపోవడంతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని పిల్లలు, పెద్దలు విషజ్వరాలు, డెంగ్యూ, టైఫాయిడ్, వాంతులు విరేచనాలతో ఆసుపత్రుల చేరుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కలుషితంలేని నీరు సరఫరా చేయాలని పారిశుధ్య పనులు చేపట్టిలని కోరారు. కార్యక్రమంలో మధుసూధన్‌రావు, కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఆత్మకూరు, సెప్టెంబరు 20: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఆత్మ, జిల్లా వనరుల కేంద్రం, నెల్లూరు ఏపీసీఎన్‌పి ఆధ్వర్యంలో ఆత్మకూరు, అనంతసాగరం, ఏయస్‌పేట మండలాల గ్రామ వ్యవసాయ సహాయకులకు ప్రకృతి వ్యవసాయం ఒక్కరోజు శిక్షణా ఇచ్చారు.

స్వచ్ఛతా హీ సేవపై అవగాహన

ఆత్మకూరు, సెప్టెంబరు 20: స్థానిక మున్సిపాలిటీలో కమిషనర్ గంగాప్రసాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపాలిటీ నుండి నెల్లూరుపాళెం వరకు 5కె రన్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజరెడ్డి, పట్టణ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రజలకు నచ్చేలా చంద్రబాబు పాలన


కావలి: కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి


వరికుంటపాడు: ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కావలి, సెప్టెంబరు 20: రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి నాయకత్వంలో కూటమి ప్రభుత్వ వందరోజుల పాలన అద్భుతంగా సాగిందని కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణ 26వ వార్డు సౌత్‌జనతాపేటలో శుక్రవారం సాయంత్రం ఆయన ఇంటింటా ప్రచారం చేపట్టారు. ముందుగా రామాలయం వద్ద పూజలు చేసి 100రోజుల పాలనకు 100 కొబ్బరికాయలు కొట్టారు. వార్డు టీడీపీ ఇన్‌చార్జి గంగినేని వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ పద్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సాధించిన విజయాలు, అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. నియోజకవర్గంలో ముసునూరు- కావలి గుంటల రోడ్డు, తీరప్రాంతంలోని కావలి-తుమ్మ లపెంట రోడ్డు, దగదర్తి-బుచ్చి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిమన్నారు.

కావ్య రెండో షేడు ఏదో చూపిస్తా..

కావ్య హైడ్రా స్టార్ట్ అయిందని ఇప్పటివరకు ఒక షేడే చూశారని రెండో షేడ్ ఏదో చూపిస్తానని ఎమ్మెల్యే ఉద్రేగభరితంగా మాట్లాడారు. పార్టీకి వెన్ను పోటు పొడిచిన వారు తెలుగుదేశం అని చెప్పుకుంటున్నారని తెలిపారు. కావలి అంతా టీడీపీకి మెజార్టీ వస్తే 26వ వార్డులో వైసీపీకి మెజార్టీ వచ్చిందని ఇక్కడ నాయకులు ఎక్కువ పనితక్కువ అన్నారు. ఇక్కడ పనికి రానివారు ఎక్కడెక్కడో తిరుగుతూ ఏదేదో చేస్తున్నారని చెప్పారు. ఇక నుంచి ఈ వార్డు ఇన్‌చార్జి గంగినేని వెంకటేశ్వర్లే అని ఆయనతోనే ఎవరైనా రావాలన్నారు. ఇది కావ్య అడ్డా అని గుర్తించుకోవాలన్నారు. ఇక్కడ ఉన్న ఒకే ఒక పార్టీ అని అది చంద్రబాబు తెలుగుదేశమే అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరాం, నాయకులు గుత్తికొండ క్రిషోర్, పోతుగంటి అలేఖ్య, కండ్లగుంట మధుబాబు నాయుడు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, జ్యోతి బాబూరావు, భరత్‌కుమార్, బ్రహ్మానందం, విఠల్ పాల్గొన్నారు.

మర్రిపాడు: ప్రజలు మెచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన వంద రోజులు సాగిందని మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మర్రిపాడులోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ప్రజాపాలనలో చంద్రబాబుకు.. జగన్‌కు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. పవిత్ర ప్రసాదమైన తిరుమల లడ్డూలో మధురమైన పదార్థాలు కలపకుండా తప్పులు జరిగాయని చంద్రబాబు ప్రభుత్వం విచారణ చేస్తుందే తప్పదురుద్దేశం వేరొకటి లేదని తెలిపారు.

ఉదయగిరి రూరల్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో ఉన్నా ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100రోజులు పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని దాసరిపల్లిలో నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. దాసరిపల్లిలో త్వరలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబుయాదవ్, మండల కన్వీనర్ బయ్యన్న, సర్పంచు గౌస్‌మొహి ద్దీన్, మాజీ సర్పంచు జమృత్ జాఫర్ మొహిద్దీన్, మాజీ ఎంపీపీ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: మాలకొండ దేవస్థానం మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి చుండిలో పార్టీ కార్యకర్తలతో ఇంటింటికి తిరిగి వంద రోజుల పాలనపై అవగాహన కల్పిం చారు. కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అ మలు చేస్తున్న పథకాల కరపత్రాలను చూ పిస్తూ వివరించారు. చెరువుపల్లి సాం బశి వరావు, వెటర్నరీ అసిస్టెంట్ కిరణ్ పాల్గొన్నారు.


చేజర్ల: కరపత్రాలను పంపిణీ చేస్తున్న మెట్టుకూరు ధనుంజయరెడ్డి, కూటమి నాయకులు

అల్లూరు: టీడీపీ సీనియర్ నాయకులు నెల్లూరు నిరంజన్‌రెడ్డి పంచాయతీల కార్యదర్శుల ఆధ్వర్యంలో నాయకులతో ఇం టింటికి తిరిగి వందరోజుల పాలనలోని కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అల్లూరులో నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు.


మర్రిపాడు: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మేకపాటి

ఉలవపాడు: నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కరేడు పంచాయతీ కొత్తపల్లెపాలెంలో మన ప్రభుత్వం-మంచి ప్రభుత్వంలో భాగంగా ప్రజావేదిక నిర్వహించారు. విజయవాడ వరద బాధితులను ముఖ్య మంత్రి చంద్రబాబు, కూటమి నాయకులు కంటికిరెప్పలా కాపాడిన విధానం చరిత్రలో నిలిచిపోతుందన్నారు.

చేజర్ల: మాముడూరులో కూటమి నా యకులు, స్థానిక అధికారులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎన్‌డీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజ యరెడ్డి నాయకులతో కలిసి ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో, ఎంపీడీవో విజయలలిత, మండల కన్వీనర్ రావి లక్ష్మీనరసారెడ్డి, బీజేపీ నాయకులు కుంకు బాలయ్య, సర్పంచ్ చిన్నయ్య పాల్గొన్నారు.

వరికుంటపాడు: గణేశ్వరాపురంలో యువనాయకులు పేరం సుధాకర్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సమీర్‌శర్మ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: టీడీపీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి సీతారామపురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, టీడీపీ, జనసేన నాయకులు గడపగడపకు వెళ్లి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో భార్గవి, కార్యదర్శులు రాంనాథ్‌రెడ్డి, జీవన్, మండల ఆయకట్టు అధ్యక్షుడు రాజశేఖర్, దేవర వెంకటేశ్వర్లు, జనసేన పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కాశీరత్తయ్య (గాంధీ), సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: పోలినేనిపాలెం, రోళ్లపాడు, చుండి, మాలకొండ, పోలినేనిచెరువు గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఇది మన ప్రభుత్వ 100రోజుల పాలనపై ఇంటింటా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, సర్పంచ్ అనుమోల అమరశ్వరి, మాదాల చిరంజీవి, మానికొండ కొండయ్య, శనివారపు మాల్యాద్రి పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

జలదంకి, సెప్టెంబర్ 20: లింగరాజు అగ్ర హారం సాగునీటి చెరువు అభివృద్ధి పనుల కు శుక్రవారం సాయ ంత్రం ఉదయగిరి ఎమ్మె ల్యే కాకర్ల సురేష్ శంకుస్థాపన చేశారు. రూ.1. 50 కోట్లతో ఈ పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పనులు నాణ్యత చేపట్టి రైతులకు ఉపయోగపడేలా చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అంతకుమునుపు ఎమ్మెల్యేను గ్రామపొలిమేర్లలో సర్పంచ్ మంగళి తిరుమల ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం చెత్తసంపద కేంద్రంను పరిశీలించి సతీమణి కాకర్ల ప్రవీణతో మొక్క నాటించారు. కార్యక్రమంలో నేతలు మధురెడ్డి, రామారావు ప్రవీణ్, మోహన్, శ్రీనివాసులు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఉదయగిరి అభివృద్ధికి సహకరించాలి

ఉదయగిరి రూరల్: పార్టీలకతీతంగా ఉదయగిరి అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. అసంపూర్తిగా ఉన్న ట్యాంక్‌బండ్‌ను శుక్రవారం ఇరిగేషన్ అధికారులు, పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ట్యాంక్‌బండ్ సుందరీకరణలో భాగంగా ఇప్పటి వరకు జరిగిన, చేయాల్సిన పనులపై జలవనరుల శాఖాధికారులతో మాట్లాడి సూచనలిచ్చారు. అలాగే పురాతన కృష్ణమందిరం సమీపంలో కోనేరు, కల్యాణ మండపాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి ట్యాంక్‌బండ్ సుందరీకరణ పనులపై ఇరిగేషన్ అధికారులతో చర్చించామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. శ్రీకృష్ణదేవరాయల కాలంనాటి పురాతన కట్టడాలను టూరిజం అధికారులతో మాట్లాడి అభివృద్ధి చేస్తామన్నారు. ఉదయగిరి దుర్గాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ చెంచలబాబు యాదవ్, మండల కన్వీనర్ బయ్యన్న, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈఈ చంద్రమౌళి, ఏఈలు వేణు, సురేష్, నాయకులు బీ నరసింహులు, రాజా, నరసింహ, ఓబుల్‌రెడ్డి, కిరణ్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్, వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలను

ప్రైవేటుకు అప్పగించొద్దు : సీఐటీయూ


ధర్నా చేస్తున్న సీఐటీయూ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు

కందుకూరు, సెప్టెంబరు 20: డ్రైవింగ్ టెస్ట్, వాహనాల ఫిట్నెస్ టెస్ట్‌లను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలనే ఆలోచన విరమించుకోవాలని సీఐటీయూ యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై శుక్రవారం సీఐటీయూ అనుబంధ కందుకూరు, ఉలవపాడు, గుడ్లూరు ఆటోవర్కర్స్ యూనియన్ల నాయకులు కందుకూరు ఆర్టీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్, ఎస్ఏ గౌస్, కొట్టే వెంకయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు గడ్డం రాజేష్, కొట్టే పుల్లయ్య, అంబలకారి చిట్టిబాబు, అక్కెలగుంట జార్జి, కోటేశ్వరరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ


నూతన దుస్తులతో విద్యార్థులు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 20: స్థానిక హైస్కూల్‌లోని 41మంది విద్యార్థులకు మాజీ సర్పంచ్ వలేటి ఆంజనేయులు జ్ఞాపకార్థం వారి కుమారులు ప్రముఖ న్యాయవాది వలేటి శ్రీధర్‌నాయుడు ప్రముఖ వ్యాపారవేత్త వలేటి మధు సూదన్‌రావులు శుక్రవారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బరామయ్య, గ్రామస్థులు వలేటి నరసింహం, కాకుమాను హర్షకుమార్, కాకుమాను ఆంజనేయులు, గుత్తా మహేశ్వరరావు, గుత్తా కొండయ్య, గుత్తా తిరుపతయ్య, చుండూరి కోటేశ్వరరావు, వీరమోసు అంజయ్య పాల్గొన్నారు.

వలేటివారిపాలెం, సెప్టెంబరు 20: జమీన్‌ఉప్పల పాడు కస్తూర్బాగాంధీ బాలికల విద్యార్థినులకు పోలినేనిపా లెం మాజీ సర్పంచ్ అనుమోల రాములు తల్లి అనుమోల ఆదెమ్మ జ్ఞాపకార్థం రూ.20వేల చెక్కు క్రీడా దుస్తుల కో సం ప్రత్యేకాధికారి గోవర్ధికి అందజేశారు. ఈ సందర్భంగా దాత రాములును టీచర్లు బృందం అభినందించారు.

చెరువుకు మరమ్మతు పనులు చేయాలి

సంగం, సెప్టెంబరు 20: మర్రిపాడు చెరువుకు మరమ్మతు పనులు చేయాలని రైతులు శుక్రవారం ఇరిగేషన్ ఏఈ బివి కృష్ణను కలిసి వినతిపత్రం అందచేశారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎటువంటి మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో చెరువు కట్టలు బలహీనపడి ప్రమాదకరంగా ఉందని, వర్షాలు రాకముందే చెరువుకు మరమ్మతు పనులు చేయాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు హరిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

కావలిలో వర్షం.. చల్లబడిన వాతావరణం

కావలి, సెప్టెంబరు 20: పట్టణంలో శుక్రవారం సాయంత్రం కురిసిన కొద్దిపాటివర్షానికి వాతావరణం కొంత మేర చల్లబడింది. వేసవిని తలపించేలా ఉన్న ఎండలతో ఇబ్బందులు పడుతుంటే ఈ వర్షంతో జనాలు కొంత ఉపశమనం పొందారు.

తప్పుడు కేసులతో ఇబ్బంది పెడుతున్నారు

కొండాపురం, సెప్టెంబరు 20: గత ప్రభుత్వంలో తప్పుడు కేసులు పెట్టి వేధించిన వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అదేవిధంగా తప్పుడు కేసులు పెట్టి టీడీపీ సానుభూతి పరులను ఇబ్బందులు పెడుతున్నారని నేకునాంపేట ఎస్సీ కాలనీకి చెందిన నలగట్ల పావని, నాగేంద్రమ్మలు శుక్రవారం విలేకరుల ఎదుట వాపోయారు. వైసీపీ నాయకుల వేధింపులు తట్టుకోలేక గ్రామాలను వదలి ఇతర ప్రాంతాల్లో తలదాచుకున్నామని, కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి గ్రామానికి వచ్చామన్నారు. ఇటీవల జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలో నలగట్ల పావని, నాగేంద్రమ్మలను చైర్మన్లుగా ఎంపిక చేయడంతో జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు బలరామిరెడ్డి, జార్జిలు కాలనీకి చెందిన నలగట్ల రుక్మిణమ్మతో తిరిగి కేసులు పెట్టించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తప్పుడు కేసులపై విచారణ చేపట్టాలన్నారు.

నేరాలపై విద్యార్థులకు అవగాహన

కందుకూరు, సెప్టెంబరు 20: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం సీఐ వెంకటేశ్వరావు మాదకద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా, ఇతర వ్యవస్థీకృత నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన పొంది అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులకు కూడా వీటిని అవగాహన కల్పించాలని సూచించారు. చిన్నారుల అఘాయిత్యాలు, బాల్య వివాహాలు, నేరాలు-ఘోరాలు, రోడ్డు ప్రమాదాల్లో బాధితులుగా మారకుండా పాటించాల్సిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఓరుగంటి వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం


విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి టౌన్, సెప్టెంబరు 20: జేబీ కళాశాల డీఆర్ క్రీడా ప్రాంగణంలో డాక్టర్ రామ్ సామాజిక సాంస్కృతిక సేవా కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం బాలల దినోత్సవ క్రీడా పోటీలు ప్రారంభం అయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విజేతలను మెడల్స్‌తో అభినందించారు. కార్యక్రమంలో విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, బీజేపీ నేత భరత్‌కుమార్, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ మధుబాబు నాయుడు, నేతలు రాజ్‌కుమార్ చౌదరి, గుత్తికొండ కిషోర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు

ఆత్మకూరు : స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న బాల భవిత కేంద్రంలో పుట్టుకతో 12 రకాల లోపాలు ఉన్న 18 ఏళ్ల లోపు పిల్లలకు ఉచిత వైద్య సేవలు అందచేస్తామని స్థానిక వైద్యులు తెలిపారు. పుట్టుకతో కాళ్ల వంకర, గ్రహణమొర్రి, వినికిడి లోపం తదితర వ్యాధులకు ఉచిత వైద్యం అందిస్తారన్నారు.

క్రీడాస్ఫూర్తిని వెలికితీయడమే లక్ష్యం


అల్లూరు : ఆటలు ఆడుతున్న విద్యార్థులు

అల్లూరు, సెప్టెంబరు 20: విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని వెలికితీయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఈవోలు రవీంద్రనాథ్, సునీత తెలిపారు. శుక్రవారం అల్లూరు రామకృష్ణ విద్యాసంస్థల క్రీడా మైదానంలో వాలీబాల్, ఖోఖో, యోగా, బ్యాడ్మింటన్, చెస్, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పీఈటీలు చంద్రశేఖర్, లావణ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్‌లో శుక్రవారం ఆటల పోటీలు పోటాపోటీగా జరిగాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, చెస్ పోటీలు నిర్వహించారు. అండర్ 14, 17 విభాగాలలో వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేశారు. శనివారం బాలురకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

స్కూల్ గేమ్స్ ఎంపికలు ప్రారంభం

ఉదయగిరి రూరల్: మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు మండల కోఆర్డినేటర్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, కోకో, బాల్‌బాడ్మింటన్‌కు సంబంధించి క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన వారికి ఈనెల 23 నుంచి 25వరకు నియోజకవర్గ స్థాయి పోటీలు వింజమూరులో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుష్పరాజ్, పీడీ వాసు, గండిపాళెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు : డీఎస్పీ

- పత్రాలు లేని 40 బైక్‌లు, 4 ఆటోల స్వాధీనం


కార్డన్‌సర్చ్ నిర్వహిస్తున్న డీఎస్పీ

కావలి రూరల్, సెప్టెంబరు 20: ఎస్పీ ఆదేశాల మేరకు నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు కావలి డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందిరానగర్, తుఫాన్‌నగర్, బాలక్రిష్ణారెడ్డి నగర్‌లో శుక్రవారం కార్డన్‌సర్చ్ నిర్వహించారు. పట్టణ 1వ, 2వ పట్టణ, రూరల్ సీఐలు ఫిరోజ్, కొండవీటి శ్రీనివాసరావు, ఎస్ఐలు రాజేశ్వరరావు, పాపారావులు స్పెషల్‌పార్టీ సిబ్బందితో 1500ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 40 బైక్‌లు, 4 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. 20మంది రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్స్ ఇళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాటాడుతూ చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 20: పీఎం విశ్వకర్మ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు నెల్లూరు రీజనల్ కార్యాలయ చీఫ్ మేనేజరు ఆంజనేయులు అన్నారు. ఉదయగిరిలోని బ్యాంకు శాఖలో శుక్రవారం లబ్ధిదారులతో రుణ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజరు చంద్రమౌళి, సహాయ మేనేజరు ధనబాబు, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాగా, పీఎం విశ్వకర్మ ప్రథమ వార్షికోత్సవ సంబరాలను స్థానిక నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాక్ ద్వారా శిక్షణ పొందిన పలువురు అభ్యర్థులకు ఎంపీడీవో ఈశ్వరమ్మ ధృవపత్రాలను పంపిణీ చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం/ ఉలవపాడు, సెప్టెంబరు 20: అన్నెబోయిన పల్లి మన్నేరు వాగు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఎస్ఐ షేక్ మహమ్మద్ సుభానీ, సిబ్బంది అన్నెబోయినపల్లి మన్నేరు బ్రిడ్జిపై ఇసుకతో వెళుతున్న ట్రాక్టర్ నిలిపి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. అలాగే, ఉలవపాడులోని మన్నేరువాగులో అనుమతులు లేకుండా ఇసుకను తరలించేందుకు వచ్చిన 5ట్రాక్టర్లను స్టేషన్ తరలించిట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి



కొడవలూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యం

• సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 20 : నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా తెలుగుదేశం ప్రభుత్వం పని చేస్తోందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. టీడీపీ 100 రోజులు పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని పాపిరెడ్డిపాలెంలో శుక్రవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని కూటమి ప్రభుత్వ పాలనలో 100 రోజుల్లో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నవంబరు 2వ తేదీన సోమిరెడ్డి ఫౌండేషన్ ద్వారా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. వైసీపీ నాయకులు ముఖ్యమంత్రిపై చేస్తున్న అనుచిత విమర్శలను ఖండించారు. ఇకపై పిచ్చివాగుడు వాగేవాళ్లను పంది మీద ఊరేగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొమ్మి సురేంద్ర, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, కోడూరు శ్రీనివాసులరెడ్డి, ముత్యాల శ్రీనివాసులు, సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సర్పంచు వెంకటసుబ్బయ్య, మేనాటి శీనయ్య పాల్గొన్నారు.

• రాష్ట్రాభివృద్ధే సీఎం చంద్రబాబు ధ్యేయం : ఎమ్మెల్యే ప్రశాంతి

కొడవలూరు : రాష్ట్రాభివృద్ధే ధ్యేయం గా సీఎం చంద్ర బాబు నాయుడు కృషి చేస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. కొడవలూరులో జరిగిన ఇది మంచి ప్రభుత్వ కార్యాక్రమం లో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ ప్రభుత్వం 100 రోజుల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్లుగా జరగని అభివృద్ధి జరిగిందన్నారు. మంచి ప్రభుత్వం అంటే ప్రజలు ప్రశాంతంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మూాంగమూరి శ్రీహరిరెడ్డి, కోటంరెడ్డి అమరేంద్ర రెడ్డి, జీవీఎన్ శేఖర్ రెడ్డి, కొడూరు కమలాకర్‌రెడ్డి, కేతూ వెంకటరమణారెడ్డి, జి రాజేంద్రకుమార్, చెక్కా మదన్, నక్క రమణయ్య పాల్గొన్నారు.

• ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తత ప్రచారం

ముత్తుకూరు : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ముత్తుకూరు బీసీ కాలనీలో ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ గోడలకు స్టిక్కర్‌లు అంటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జునయాదవ్, సర్పంచు బూదూరు లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శేష గిరిరావు, నాయకులు షేక్.అబ్దుల్‌షఫీవుల్లా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

• అనికేపల్లిలో 'ఇది మంచి ప్రభుత్వం'

వెంకటాచలం : మండలంలోని అనికేపల్లిలో టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ ఆధ్వర్యంలో ఆపార్టీ నేతలు ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. చల్లా రవీంద్ర, గొట్టం బ్రహ్మయ్య పాల్గొన్నారు.

• ప్రచారం నిల్

ఈ నెల 20 నుంచి 26 వరకు గ్రామాల్లో కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన గురించి వివరిస్తూ ప్రజలు మెచ్చేలా ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని రూపొందించింది. సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. కానీ మండల అధికారుల వైఫల్యం కారణంగా శుక్రవారం ఆ కార్యక్రమం ఎక్కడ చేపట్టారు.. అసలు నిర్వహించారా లేదా అని ఎవరికి తెలియలే దు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలకు తెలియడం ప్రశ్నార్థకమే.

• అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన

మనుబోలు : మండలంలోని అన్ని పంచాయతీల్లో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఈవోఆర్‌డీ జీవీఎస్‌వీ ప్రసాద్‌లు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు కరపత్రాలు పంపిణీ చేస్తూ ఇంటింటికి స్టిక్కర్ అంటించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

• నేడు వడ్లపూడిలో ఎమ్మెల్యే పర్యటన

వడ్లపూడి గ్రామంలో శనివారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

• రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు కృషి

విడవలూరు : విడవలూరు, ముదివర్తి, దంపూరు, అన్నారెడ్డిపాళెం, చౌకిచర్లలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అలాగే పారిశుధ్య పనులు చేపట్టారు. విడవలూరు పీహెచ్‌సీ, జడ్పీ ఉన్నత పాఠశాల్లోని ముళ్ల పొదలను తొలగించారు. ముదివర్తిలో చెత్తా చేదారాన్ని తీశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి పొన్నలూరు పురంధర్‌రెడ్డి, ఎస్.కె, రఫీ, ఓగు నాగేశ్వరరావు, సింహాద్రి అయ్యప్ప, చేవూరు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సండే మార్కెట్ సేవలు అభినందనీయం

• ఏపీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ



నెల్లూరు (వైద్యం): నగరంలోని సండే మార్కెట్ వ్యాపారులు అందిస్తున్న సేవలు అభిందనీయమని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ కొనియాడారు. నగరంలోని సండే మార్కెట్ 40వ వార్షికోత్సవం శుక్రవారం పురమందిరంలో సండే మార్కెట్ వ్యాపారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు కిశోర్‌బాబు అధ్యక్షతన జరిగింది. ముందుగా వ్యాపారులు రెడ్‌క్రాస్ రక్తనిధికి రక్తదానం చేశారు. అనంతరం జరిగిన సదస్సులో ఝాన్సీ మాట్లాడుతూ వ్యాపారులు ఎన్నో కష్టాలు ఎదుర్కొని సండే మార్కెట్‌లో వ్యాపారాలు కొనసాగిస్తున్నార న్నారు. జిల్లా మాజీ కలెక్టర్ రాజు తన సందేశాన్ని తెలియచేస్తూ తాను జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో ఉన్నందున రాలేక పోయానని చెప్పారు. భవిష్యత్తులో సండే మార్కెట్ ఎంతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తరిమెల నాగిరెడ్డి స్కూల్ విద్యార్థుల నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సండే మార్కెట్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు హఫీజుద్దీన్, కార్యదర్శి సెంథిల్‌కుమార్, కోశాధికారి ముత్తు తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల పాలన బాగుంది

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 20 : తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలన చాలా బాగుందని ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు అన్నారు. చిన్నబజారు, నారాయణరావుపేట, గుప్తా పార్క్ సెంటర్, సవరాల వీధి తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఇంటింటికి తిరిగి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ పనితీరుపై కరపత్రాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ గణేష్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, మెహర్నిసా, కంచి రాధాకృష్ణ, రమేష్, ప్రశాంతి, రసూల్, సునీత పాల్గొన్నారు.

'అపోలో'లో ఫైజర్ వ్యాక్సినేషన్ సెంటర్

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 20 : నెల్లూరు అపోలో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో శుక్రవారం ఫైజర్ సంస్థ సహకారంతో అడల్ట్ వ్యాక్సినేషన్ సెంటర్ ప్రారంభించారు. ఆసుపత్రి మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరాం సతీష్, న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందుమీనన్, గుండె వైద్య నిపుణుడు డాక్టర్ భక్తవత్సలరెడ్డి, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ చక్రవర్తి ఈ సెంటర్‌ను ప్రారంభించారు. శ్రీరాం సతీష్ మాట్లాడుతూ ఈ సెంటర్‌ను వృద్ధుల కోసం ఏర్పాటు చేశామని, ఇక్కడ అన్ని టీకాలు అందుబాటులో ఉంటాయని చెతప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దినేష్‌రెడ్డి, డాక్టర్ ఎంసీఎస్ రెడ్డి, ఫైజర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆపిల్ ఐఫోన్ 16 సిరీస్ విడుదల

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 20 : నగరంలోని బాలాజీ మొబైల్స్‌లో శుక్రవారం సాయంత్రం ఆపిల్ ఐ ఫోను 16 సిరీస్ ఘనంగా విడుదలైంది. బాలాజీ మొబైల్స్ 33వ వార్షికోత్సవం సందర్భంగా ఐ ఫోను 16, ఐ ఫోను 16ప్లస్, 16ప్రో, 16ప్రోమ్యా మోడల్స్ అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని బాలాజీ సంస్థ నెల్లూరు జీఎం రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎంలు మనోజ్‌కుమార్, వెంకీ, మేనేజర్లు హరిప్రసాద్, కల్యాణ్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యకు దళితులు దూరం

• మూతపడ్డ ఎయిడెడ్ పాఠశాల

• వైసీపీ ప్రభుత్వ నిర్వాకం



మూసేసిన ఎంఎస్ఎం ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాల

కోవూరు, సెప్టెంబరు 20 : గతంలో ఆ ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులతో కళకళలాడేది. కోవూరులోకెల్లా విద్యలో అత్యుత్తమ పాఠశాలగా ఉండేది. అయితే నేడది కాలగర్భంలో కలసిపోయింది. వైసీపీ ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలలపై కత్తిగట్టింది. దీంతో ఎంతో పేరుప్రఖ్యాతులు ఉన్న ఆ పాఠశాల కనుమరుగైంది. వివరాల్లోకి వెళితే.. 60 ఏళ్లకు పూర్వం కోవూరు రాళ్లమిట్ట దళితకాలనీ ప్రాంతంలో మురుగుడు శేషయ్య మెమోరియల్(ఎంఎస్ఎం) ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు.ఇక్కడి ఉపాధ్యాయులు వేలాది మందిని ప్రయోజకులుగా తీర్చిదిద్దారు. పూర్వ విద్యార్థులు దేశవిదేశాల్లో అత్యుత్తమ స్థాయిలో రాణించారు. గత ప్రభుత్వ విద్యావ్యతిరేక విధానం వల్ల ఈ పాఠశాల మూతపడింది. ఇక్కడి ఉపాధ్యాయులు బదిలీపై ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లారు. చదువుకుంటున్న విద్యార్థులు దూరాన ఉన్న లైబ్రరీసెంటర్, చావడివీధి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేరారు.

• విద్యార్థులకు తిప్పలు

స్థానిక నాగులపుట్ట గిరిజనకాలనీ, రాళ్లమిట్ట అరుంధతీవాడ కాలనీ, మసిగానితోట బీసీకాలనీ, వడ్డిపాళెం ప్రాంతాల్లోని 1 నుంచి 5 వరకు చదువుకుంటున్న విద్యార్థులు బ్యాగులు మోసుకొని నడుచుకుంటూ లైబ్రరీసెంటర్, చావడివీధి ప్రాథమిక పాఠశాలలకు అతికష్టం మీద వెళ్లాల్సి వస్తోంది.దీంతో వారు పాఠశాలలకు సక్రమంగా హాజరుకాలేకపోతున్నారు. ప్రైవేటు పాఠశాలలో చేరిన పిల్లలకు తలిదండ్రులు ఫీజులు కట్టలేకపోవ డంతో బడి మానేస్తున్నారు. ఎయిడెడ్ పాఠశాల ఉన్న చోట ప్రభుత్వపాఠ శాలను నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనలతోనే మూసివేత

ప్రభుత్వ నిబంధనల ప్రకారం గతంలో ఎయిడెడ్ పాఠశాలను మూసేశారు. విద్యార్థుల్ని పక్క బడుల్లో చేర్పించాం. నూతన పాఠశాల ఏర్పాటు ప్రతిపాదనను ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

-షేక్ రహీం, ఎంఈవో

ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలి



ఏళ్ల చరిత్ర ఉన్న ఎయిడెడ్ పాఠశాల మూసేశారు. దీంతో పేదలు విద్యకు దూరం అవుతున్నారు. ప్రభుత్వాధికారులు నూతనంగా ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటుచేస్తే ఎంతో మేలు జరుగుతుంది.

- గాదిరాజు అశోక్‌కుమార్, మాజీ ఉప సర్పంచు

వైసీపీ ప్రభుత్వ విధానాలతో పాఠశాల మూత



వైసీపీ ప్రభుత్వ విధానాలతో ఎంతో పేరున్న రాళ్లమిట్టలోని ఎయిడెడ్ పాఠశాల మూతపడింది. దీంతో వందలాది మంది పిల్లలు ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యాభిమానులు స్పందించి మూసేసిన ఎయిడెడ్ పాఠశాల స్థానంలో నూతనంగా ప్రభుత్వమే పాఠశాల నిర్మించాలి.

- పిచ్చుక మధుసూదనరావు, సత్రంవీధి

ఘనంగా 'ఇది మంచి ప్రభుత్వం'

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 20 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా సాధించిన ప్రగతి, తీసుకున్న నిర్ణయాలను వివరిస్తూ 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నెల్లూరు నగరం, రూరల్ ప్రాంతాలలో శుక్రవారం ఘనంగా మొదలైంది. సచివాలయాల వారీగా అధికారులు, సిబ్బంది, టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలు అందచేశారు. గోడలపై స్టిక్కర్లు అంటించారు. అల్లీపురంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత పోలూరు సుబ్బయ్య, నాయకులు సురేంద్ర, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలు అందుతున్నాయన్నారు. పింఛను రూ.4 వేలకు పెంచి పేదలకు ఆర్థిక భరోసా కల్పించారని తెలిపారు.



గోడకు స్టిక్కర్ అంటిస్తున్న అధికారులు, నాయకులు

రామచంద్రాపురం పాఠశాలలో విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విడవలూరు, సెప్టెంబరు 20: మండలంలోని రామచంద్రాపురం పాఠశాలలో మధ్యాహ్న భోజనా నికి సంబంధించిన బియ్యంలో పురుగులు, రాళ్లు ఉన్న విషయంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై జిల్లా అధికారులు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్పందించారు. వారి ఆదేశాల మేరకు శుక్రవారం ఎంఈవో వెంకటేశ్వర్లు పాఠశాలలో విచారణ చేపట్టారు. బియ్యాన్ని పరిశీలించారు. నిర్వాహకురాలిని, హెచ్ఎం, రేషన్ డీలర్‌ని పిలిచి చర్చించారు. పిల్లలకు భోజనం పెట్టే విషయంలో అశ్రద్ధ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విచా రణ అనంతరం అయన మాట్లాడుతూ రాల్లు, పురు గులు ఉన్న బియ్యాన్ని మార్చి నాణ్యమైన బియ్యాన్ని అందజేశామన్నారు. పిల్లలకు భోజనంపై రాజీ పడేది లేదన్నారు. ఇలాంటి తప్పిదాలు పునరావృతం అయితే చర్యలు తప్పవన్నారు.



పాఠశాల్లో విచారణ చేస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్లు

రెండు నెలల్లో పొదలకూరురోడ్డు ఆధునికీకరణ

• రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, సెప్టెం బరు 20 : నగరంలోని పొదలకూరు రోడ్డును రానున్న రెండు నెలల్లో సుందరంగా ఆధునికీకరిస్తామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సారాయి అంగడి సెంటర్‌లో రూ.6 కోట్ల ఆధునికీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీకే కళాశాల నుంచి డైకస్ రోడ్డు వరకు సుమారు 5 కి.మీ మేర రోడ్డు ప్రయాణానికి అనువుగా లేదన్నారు. ఈ రహదారిపై వేలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయని తెలిపారు. దీంతో ప్రజలు, ప్రయాణికులు పడే ఇబ్బందులు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా రూ. 6 కోట్లు నిధులు మంజూరు చేశారని తెలిపారు. రెండు మాసాల వ్యవధిలో రోడ్డు పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కాగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి 34వ డివిజన్‌లో ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందచేసి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ఎస్ఐని సన్మానించిన టీడీపీ నేతలు

విడవలూరు, సెప్టెంబరు 20: విడవలూరు ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నరేష్ కుమార్ యాదవ్‌ను శుక్రవారం టీడీపీ నేతలు పాశం శ్రీహరిరెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, ఎస్‌కె. రఫీ, పొన్నలూరు పురంధర్‌రెడ్డి, శరత్ చంద్రలు కలసి సన్మానించారు.



ఎస్ఐని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

విశ్రాంత ఉద్యోగులకు సత్కారం

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 20 : వైద్య ఆరోగ్యశాఖలో ఉత్తమ సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన వారిని శుక్రవారం వాత్సల్య అనాథ శరణాలయంలో సత్కరించారు. వైద్యఆరోగ్యశాఖ మాస్‌మీడియా అధికారి బీ శ్రీనివాసులు, లక్ష్మీప్రసన్న, సీహెచ్‌వోలు ఆర్ ఇందిర, జయశ్రీ, ప్రమీల, హెల్త్ అసిస్టెంట్ పరిమళ, పీహెచ్ఎస్‌లు గుల్షన్, ప్రఫుల్ల తదితరులను సన్మానించారు. ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు, వాత్సల్యా ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు, వైద్యఆరోగ్యశాఖ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కల్లం శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు ఖాదర్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



సత్కారం పొందిన విశ్రాంత ఉద్యోగులతో నిర్వాహకులు, బాలలు

23న విశ్రాంత ఉద్యోగుల సమావేశం

ఈనెల 23వతేదీ సాయంత్రం 5 గంటలకు టౌన్‌హాల్లో ఏపీ రిటైర్డు ఉద్యోగుల సంఘం సమావేశం జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఐ లక్ష్మీనారాయణ, కార్యదర్శి పీ వెంకయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 20 : సైబార్ నేరాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ఎస్ రామారావు సూచించారు. నగరం లోని డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్‌లో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ పెరిగిన నేపథ్యంలో అవసరాలు, సౌక ర్యాలు, విలాసాల నడుమ తేడా తెలుసుకుని సాంకేతికతను వినియోగించు కోవాలని తెలిపా రు. ఈ కార్యక్రమంలో ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు, డిప్యూటీ వార్డెన్లు జీ కరుణకుమారి, వైటీఎస్ శ్రీదేవి, హాస్టల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టాటా కర్వ్ కార్ విడుదల

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని వరలక్ష్మీ ఆటో మొబైల్స్ ప్రైవేటు లిమిటెడ్ (టాటా మోటార్స్) టాటా షోరూమ్‌లో శుక్రవారం టాటా కర్వ్ కారు మార్కెట్‌లోకి విడుదలైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేఎస్ఎన్ గ్రూపు అధినేత కే సత్యనారాయణ, డీటీసీ చందర్, ఆర్టీవో శ్రీచందన్ పాల్గొని కొత్త కారును విడుదల చేశారు. కూపే ఎస్‌యూవీ సెగ్మెంట్లో సామాన్య, మధ్యతరగతి వారికి అందుబాటులో కర్వ్ కారును తయారు చేశార న్నారు. ఈ కార్యక్రమంలో అపోలో ఆసుపత్రి వైద్యుడు రాజశేఖర్, ఆర్టీసీ ఏవో రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్‌లో చెట్లకు నిప్పు

కోవూరు, సెప్టెంబరు 20 : మండల పరిధిలోని పోతిరెడ్డిపాలెం గ్రామానికి సమీపంలోని పూసల కాలనీ వెనుక ఉన్న శ్రీషిరిడీ లేఅవుట్‌లో ముళ్ల పొదలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో చెట్లు కాలిపోయాయి. పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో పూసల కాలనీవాసులు నిప్పురవ్వలు గాలికి పూరిళ్లపై పడి కాలనీ మొత్తం తగలబడుతుందని భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

తిరుమల లడ్డూలో కల్తీపై చర్యలు తీసుకోవాలి


బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 20: కమీషన్లకు కక్కుర్తిపడి తిరుమలలో వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు నుంచి వచ్చే నూనెను ఉపయోగించిన అధికారులు, పాలకులపై చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు రామిశెట్టి మోహన్‌బాబు ఆధ్వర్యంలో తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నమామి గంగే రాష్ట్ర ప్రముఖ్ మిడతల రమేష్, బీజేపీ నాయకులు కాసా శ్రీనివాసులు, లక్ష్మయ్య, సరేంద్ర, తిరుమలేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 20 : నగరంలోని కిసాన్‌నగర్, మార్కెట్‌యార్డు సబ్‌స్టేషన్ల పరిధిలో ఏబీ స్విచ్‌లకు మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సర ఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. జాకీర్ హుస్సేన్ నగర్, కిసాన్ నగర్, వేణుగోపాల్ నగర్, సింహపురి కాలనీ, ప్రశాంతి నగర్, పుల్లమ్మ సత్రం, నవాబు పేట, కుసుమ హరిజనవాడు, నజీర్‌తోట, రామచంద్రాపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని, వినియోగదారులు గుర్తుంచుకోవాలని కోరారు.

రాజరాజేశ్వరి దీక్ష ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 20 : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో 50వ శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా 18వ శ్రీరాజరాజేశ్వరి మాలాధారణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. శ్రీరాజరాజేశ్వరి సేవా సమితి అధ్యక్షుడు సన్నపరెడ్డి పెంచలరెడ్డి, అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో 21రోజులపాటు ఈ భవానీ దీక్ష కొనసాగుతుంది. అక్టోబరు 11వతేదీ భవానీలు అమ్మవారికి ఇరుముడి సమర్పించి దీక్షను విరమిస్తారు. ఈ మాలాధారణ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామశర్మ ప్రారంభించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దీక్ష చేపట్టారు. ఆలయ చైర్మన్ రత్నం జయరామ్, సహాయ కమిషనర్ బీ వెంకట సుబ్బయ్య, రాజరాజేశ్వరి సేవా సమితి అధ్యక్షుడు సన్నపరెడ్డి పెంచలరెడ్డి పాల్గొన్నారు.



అన్నదానానికి రూ.లక్ష విరాళం

రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళాలు వచ్చాయి. కరణం దొరబాబు రూ.50వేలు, రాయపనేని విజయకుమార్ రూ.50 చొప్పున ఆలయ ఈవో, సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్యకు అందజేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

వెంకటాచలం, సెప్టెంబరు 20 : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ యూనిట్ -4 ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆహారపు అలవాట్లు, పోషకాహార విలువలు గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని కల్పన, తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ టెర్మినల్‌ను పునఃప్రారంభించాలి

• సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రచార జాతా

వెంకటాచలం, సెప్టెంబరు 20 : కంటైనర్ టెర్మినల్‌ను కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం ఉద్దేశపూర్వకంగానే మూసివేశారని, వెంటనే తిరిగి ప్రారంభించి ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంపొందించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఓడూరు వెంకటకృష్ణయ్య కోరారు. శుక్రవారం మండలంలోని అనికేపల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రచార జాతా నిర్వహించారు. కంటైనర్ టెర్మినల్ వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నేత గోగుల శ్రీనివాసులు, నాయకులు షేక్ సీరాజ్, వెంకటేశ్వర్లు, వేణు, కృష్ణ, వెంకయ్య తదితరులున్నారు.

నేడు కండలేరు ఎడమ కాలువకు నీరు విడుదల

పొదలకూరు, సెప్టెంబరు 20 : సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్ ఎడమ గట్టు కాలువ ద్వారా అధికారులు నీటిని విడుదల చేయనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు ప్రకటనలో తెలిపారు. నిమ్మ, జామాయిల్, సవక, పత్తి, మిరప, మామిడి పంటలు, కూరగాయలు పంటలు రైతాంగం కోరిక మేరకు, పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆటోడ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

మనుబోలు, సెప్టెంబరు 20: స్థానిక కోదండరామపురంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఆటోడ్రైవర్ జల్లి మధు కుటుంబానికి మనుబోలు ఆటోడ్రైవర్లు సంఘం తరపున రూ.14 వేల ఆర్థికసాయం శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మద్దాలి రాజగోపాల్, జడ శివకుమార్ పాల్గొన్నారు.

హెల్మెట్ పెట్టుకో.. ప్రాణాలు కాపాడుకో

• పోలీసుల మోటార్‌సైకిల్ ర్యాలీ

మనుబోలు, సెప్టెంబరు 20: వాహనదారులారా హెల్మెట్ పెట్టుకో.. ప్రాణాలు కాపాడుకో అంటూ పోలీసులు శుక్రవారం మనుబోలులో మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పొదలకూరు సీఐ రాంబాబు, ఎస్ఐ రాకేష్, ఇతర పోలీసులు హెల్మెట్‌లు ధరించి స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి మనుబోలు గ్రామం వరకు మోటార్‌సైకిళ్ల ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ప్రతిఒక్కరు మోటార్‌సైకిల్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. లైసెన్సు, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. చిన్నపిల్లలకు మోటార్ సైకిల్ ఇస్తే పెద్దలపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆటోడ్రైవర్లు నిబంధనలకు లోబడే ప్రయాణికులను ఎక్కించాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా టీడీపీ నాయకుల వేడుకలు

మనుబోలు, సెప్టెంబరు 20: స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం స్థానిక టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలికి రమేష్‌రెడ్డి, చిట్టిబాబు, శివుడు రాజాగౌడ్, బండికట్టు రవీంద్రబాబు, ఏ.దామోదర్‌రెడ్డిలు ఘనంగా నిర్వహించారు.

డ్రైవింగ్, ఫిట్నెస్ టెస్టులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించొద్దు

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 20 : డ్రైవింగ్, వాహనాల ఫిట్నెస్ టెస్టులను ప్రైవేటు సంస్థలకు అప్పగించవద్దని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మారుబోయిన రాజా పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని నరుకూరు సెంటర్‌లో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 2019 మోటార్ యాక్ట్ సవరణ చట్టంను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తే ఆటో డ్రైవర్ల కుటుంబీకులు వీధుల పాలవుతారని తెలిపారు. ఈ చట్టాని వ్యతిరేకిస్తూ అనెల 29వ తేదీన ఆర్టీవో కార్యాలయం ముట్టడిస్తామని, జిల్లాలోని నలుమూలల ఆటో కార్మికులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కృష్ణపట్నం తీరంలో వ్యర్థాల తొలగింపు

ముత్తుకూరు, సెప్టెంబరు 20 : వినాయక విగ్రహాల నిమజ్జనాల సందర్భంగా వ్యర్థ పదార్థాలతో నిండిపోయిన కృష్ణపట్నం సముద్ర తీర ప్రాంతాన్ని శుక్రవారం స్థానిక టీడీపీ నాయకులు రాగల శివకృష్ణ ఆధ్వర్యంలో యువకులు శుభ్రం చేశారు. 10 రోజులుగా వినాయక నిమజ్జనాలతో కృష్ణపట్నం సముద్రతీరం కిటకిటలాడింది. నిమజ్జనం కోసం వచ్చిన యువకులు ప్రజలు సముద్రతీరంలో పడవేసిన వ్యర్థాలు, ప్లాస్టిక్ సంచులతో ఈ ప్రాంతమంతా మలినంగా మారింది. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ ప్రాంతాన్ని అంతా శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో లేబూరు రవిచంద్ర, కరణం రాజేష్, పురిణి మహేష్, మక్కి మహేష్, కరంచెట్టి శశికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

మనసు చివుక్కుమంటోంది

లడ్డూ వివాదంపై భక్తుల మనోగతం



తిరుపతి వెళ్లొచ్చామంటే.. మన చుట్టుపక్కల వాళ్లు అడిగే ప్రశ్న.. లడ్డూ ప్రసాదం ఎక్కడ? అందుకే తిరుమలకు వచ్చిన భక్తులు వీలైనన్ని ఎక్కువ లడ్డూలను తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తారు. తలాకొంచెం ప్రసాదంగా పెడతారు. ఇదీ కొండ లడ్డూకున్న ప్రత్యేకత. దీని రుచి, సువాసన ప్రపంచంలో మరే లడ్డూకు లేదంటే అతిశయోక్తి కాదు. అందుకే తిరుమల లడ్డూకు పేటెంట్ దక్కింది. దాదాపు 310 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీవారి లడ్డూ ప్రసాదంపై వివాదం రగిలింది. లడ్డూలకు వినియోగించే ఆవు నెయ్యిలో జంతువుల కొవ్వు, చేప నూనె అవశేషాలు కలిశాయన్న ప్రచారంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మనసు చివుక్కుమంటోందని ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో శ్రీవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు అలిపిరి, తిరుమలలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

- తిరుపతి/తిరుమల,ఆంధ్రజ్యోతి

ఎప్పుడూ వినలేదిలా..

పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల గుడిలో ఇలాంటి అపచారం జరిగిందని ఎప్పుడూ వినలేదు. దేవుడి ప్రసాదంగానే భావిస్తున్నాం కాబట్టి అలాంటి వివాదాలను పట్టించుకోలేదు. నిజమని నమ్మడంలేదు. ప్రస్తుతం తీసుకున్న లడ్డూ ప్రసాదం బాగానే ఉంది.

- సుజాత, నెల్లూరు



భరించరాని తప్పిదమిది

శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగం ఎప్పుడు జరిగినా భరించరాని తప్పిదమది. శ్రీవారి ఆలయానికి వచ్చే భక్తులను మాత్రమే తనిఖీ చేయడం కాదు. అన్న ప్రసాదాలకు వచ్చే ముడిసరుకులను కూడా ల్యాబ్‌లో క్షుణ్ణంగా పరిశీలించాలి. ప్రతి వస్తువు నాణ్యతగా ఉండేలా చూసుకోవాలి. ప్రభుత్వం మారిందికాబట్టి ఇకనైనా జాగ్రత్తలు తీసుకోవాలి.

- చంద్రిక, ప్రకాశం



ఏదైనా అపచారం జరిగితే ఆలయం శుద్ధి చేపట్టాలని ఆగమశాస్త్రంలో ఉంది. ఆగమ సలహా మండలి సభ్యుల ద్వారా సలహాలు తీసుకుని ఆ కార్యక్రమాలు చేపట్టాలి. అయితే ప్రస్తుతమున్న ఆగమ సలహామండలిలో ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. వారికి స్వతంత్ర అభిప్రాయాన్ని చెప్పే ధైర్యం లేదు. వైఖానస ఆగమశాస్త్రంలో అనుభవం ఉన్న వారిని సంప్రదించి శుద్ధి కార్యక్రమాలు చేపట్టాలి. శాస్త్రం ప్రకారం శుద్ధి చేసి స్వామిని తృప్తిపరిస్తేనే మనకు మేలు.

- రమణదీక్షితులు, మాజీ ప్రధాన అర్చకుడు





ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి

వెంకన్న లడ్డూ తయారీలోనూ కక్కుర్తి పడతారని ఎవరూ అనుకోలేదు. తెలిసి చేసినా, తెలియక చేసినా ఇది ఘోర తప్పిదమే. లడ్డూకు వాడిన నెయ్యి కల్తీగురించి సీఎం చంద్రబాబు చెప్పగానే ఇది నిజం కాకపోతే బాగుండు అనిపించింది. అయితే ల్యాబ్ రిపోర్టులోనూ నిర్ధారణ కావడంతో బాధ కలిగింది. దీనికి కారకులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- జగదీష్, నెల్లూరు



ఇప్పుడు లడ్డూలు బాగున్నాయి

ఐదుగురు మిత్రులతో కలిసి బెంగళూరు నుంచి తిరుమలకు వస్తున్నప్పుడే లడ్డూలో వాడే నెయ్యి కల్తీ విషయం తెలిసింది. చాలా బాధపడ్డాం. గతంలో కల్తీ నెయ్యితో తయారైన లడ్డూలు తిన్నవారు ఎంత మదన పడుతుంటారో? ఇప్పుడు మేము ఐదేసి లడ్డూల చొప్పున తీసుకున్నాం. ఇప్పుడు లడ్డూ బాగుంది.

- ముత్తువేలు, బెంగళూరు

నా గుండెల్లో బంగారుపాళ్యం



- ఇక్కడినుంచే దండయాత్రగా మారిన పాదయాత్ర
- పాదయాత్రను అడ్డుకునేందుకు వైసీపీ విఫలయత్నం
- తోడుగా నిలిచిన ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటా
- మంత్రి లోకేశ్

బంగారుపాళ్యం/చిత్తూరు,ఆంధ్రజ్యోతి

బంగారుపాళ్యం నా గుండెల్లో ఉంటుంది. పాదయాత్రలో ఇక్కడ నాపైన డీఎస్పీ దాడి చేస్తే, లాఠీఛార్జికి ప్రయత్నిస్తే, స్టూల్ లాక్కుంటే ఇక్కడి ప్రజలే అండగా నిలిచారు. డీఎస్పీ తీరుతో కానిస్టేబుళ్లు కూడా సహాయనిరాకరణ చేశారు.పాదయాత్రలో మీరు నాపై చూపిన అభిమానానికి రుణం తీర్చుకోవడానికే ఈ రోజు ప్రజాప్రభుత్వంలో మంత్రిగా మీ ముందుకు వచ్చా' అని మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు.యువగళం పాదయాత్రలో వంద కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా బంగారుపాళ్యంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ హామీని నిలబెట్టుకుంటూ శుక్రవారం ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని లోకేశ్ ప్రారంభించారు. కొత్తగా నిర్మించిన 30 పడకల ఆస్పత్రి భవనాల్ని ప్రారంభించారు.ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు.అనంతరం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని పరిశీలించారు. 'వచ్చే ఐదేళ్లలో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేసి ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటా. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో ఎవరూ చేయని విధంగా 14 నియోజకవర్గాలను టచ్ చేస్తూ 45 రోజుల పాటు 577 కిలోమీటర్ల మేర కొనసాగిన యువగళం పాదయాత్ర రికార్డు సృష్టించింది. పాదయాత్రను అడ్డుకోవడానికి బంగారుపాళ్యంలో జగన్ ప్రభుత్వంలోని పోలీసులు ఎంత అరాచకం సృష్టించారో మీరంతా చూశారు.అప్పటి డీఎస్పీ అమరన్న చేయి పట్టుకున్నారు. నేను నిలదీస్తే నాపైనా కేసులు పెట్టారు. హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ వంటి 23 కేసులు నమోదు చేశారు.అంతేకాకుండా నా పాదయాత్రను అడ్డుకునేందుకు జీవో 1 విడుదల చేసి, ఇదే బంగారుపాళ్యంలో నా ప్రచార రథాన్ని అడ్డుకున్నారు. నా గొంతు నొక్కాలని విఫలయత్నం చేశారు.ఎన్ని అడ్డంకులు సృష్టించినా యువగళాన్ని ఆపడం వారి తరం కాలేదు.ఇక్కడి ప్రజల మద్దతుతోనే కుప్పంలో ప్రారంభమైన యువగళం పాదయాత్ర దండయాత్రగా మారింది' అని లోకేశ్ తెలిపారు.

లోకేశ్ పర్యటన విజయవంతం

తన పాదయాత్రలో ఇచ్చిన తొలి హామీని అమలు చేసేందుకు వచ్చిన మంత్రి లోకేశ్ పర్యటన విజయవంతమైంది. గురువారం రాత్రి తిరుపతి నుంచి బయలుదేరగా దారి పొడవునా నాయకులు, శ్రేణుల ఘన స్వాగతాలతో ఆలస్యంగా బంగారుపాళ్యానికి చేరుకున్నారు. శుక్రవారం ఉదయాన్నే పార్టీ శ్రేణులకు, అభిమానులకు సమయం కేటాయించి మాట్లాడారు.ఫొటోలు దిగారు. బంగారుపాళ్యంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో లోకేశ్‌కు అర్జీలు ఇవ్వడానికి, ఫొటోలు తీసుకోవడానికి పెద్దఎత్తున ప్రజలు ఎగబడ్డారు. సాయంపై.. సమస్యలపై పలువురు వినతులిచ్చారు. తిరుపతిలో అన్యాక్రాంతమైన హథీరాంజీ మఠం భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని హథీరామ్ బావాజీ పరిరక్షణ కమిటీ కోరింది. ఇక, శ్రేణులతో విడిగా సమావేశమై ఉత్తమ కార్యకర్తల్ని అభినందించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం.. మన టీడీపీ యాప్ ద్వారా ఉత్తమ పనితీరు చూపిన కార్యకర్తలకు ప్రశంసాపత్రాలందించారు. తిరుగుప్రయాణంలో గాదంకి టోల్‌ప్లాజా వద్ద కార్యకర్తలతో కలసి టీ తాగి.. పాదయాత్రనాటి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు మురళీమోహన్, అమరనాథ రెడ్డి, పులివర్తి నాని, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, గాలి భానుప్రకాష్, గురజాల జగన్మోహన్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, అధికారులు పాల్గొన్నారు.

ఆకనంబట్టు పాఠశాల తనిఖీ

పూతలపట్టు: మంత్రి నారా లోకేశ్ శుక్రవారం మధ్యాహ్నం పూతలపట్టు మండలం ఆకనంబట్టు హైస్కూల్‌ను తనిఖీ చేశారు.8, 9, 10 తరగతుల గదులను సందర్శించి లోటుపాట్లపై విద్యార్థులతో మాట్లాడారు. బెంచీలు లేవని చెప్పగా, త్వరలో ఏర్పాటు చేస్తామని హామీయిచ్చారు. గతంలో టాయిలెట్స్ కంపుకొట్టేవని, ప్రస్తుతం పరిశుభ్రంగా ఉంటున్నాయని విద్యార్థులు చెప్పారు. ఇంకా పాఠ్యపుస్తకాలు అందలేదని చెప్పగా.. తక్షణమే అందించాలని అధికారులను ఆదేశించారు. పెచ్చులూడిన తరగతి గదులకు మరమ్మతులు చేయిస్తానన్నారు. టీచర్లతో సమావేశమైన ఆయన విద్యార్థుల హాజరు 70శాతం మాత్రమే ఉండడానికి కారణమేంటని తెలుసుకున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లలో విద్యార్థులు అనవసర కంటెంట్ చూస్తున్నట్లు ఫిర్యాదులు అందిన దృష్ట్యా వీటికి బదులుగా పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లను అభివృద్ధి చేయడంపై పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

తిరుపతి ఆర్డీవోపై వేటు

- అవినీతి ఆరోపణల కేసులో చిక్కిన నిషాంత్‌రెడ్డి
- అప్పటి పుత్తూరు తహసీల్దారు, కలెక్టరేట్ సూపరింటెండెంటు కూడా సస్పెన్షన్


నిషాంత్‌రెడ్డి

తిరుపతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఓ పెట్రోల్ బంకుకు ఎన్వోసీ ఇచ్చేందుకు తన క్యాంప్ క్లర్క్ ద్వారా రూ.లక్ష డిమాండు చేశారన్న బాధితుడి ఫిర్యాదు, అనంతరం వివిధ దశల్లో జరిగిన సుదీర్ఘ విచారణ మేరకు ఆయన్ను సస్పెండు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పూర్వాపరాలను పరిశీలిస్తే.. పుత్తూరు సమీపంలో హెచ్‌పీసీఎల్ పెట్రోలు బంకు శ్రీనివాసులు కుటుంబానికి అన్ని అనుమతులతో మంజూరైంది. ఎన్వోసీ (నిరభ్యంతర పత్రం) కోసం ఫైలు ఆర్డీవో కార్యాలయానికి చేరింది. ఆర్డీవో నిషాంత్ రెడ్డి తన క్యాంప్ క్లర్క్ ద్వారా ఎన్వోసీ కోసం రూ.లక్ష డిమాండు చేశారని బాధితుడు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్వోసీ ఇవ్వాలని కలెక్టర్ సూచించినా మరోసారి తన సీసీ ద్వారా రూ.50వేలు వసూలు చేశారు. భూమార్పిడి కోసం మరో రూ.30వేలు డిమాండు చేయడంతో సీసీఎల్‌ఏకు ఫిర్యాదు చేశారు. దీంతో జేసీ శుభం బన్సల్‌తో విచారణ జరిపించగా, ఆయన ఆర్డీవోకు అనుకూలంగా నివేదిక ఇచ్చారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు రావడంతో సీసీఎల్‌ఏ సాయిప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి విచారించాలని జేసీని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిషాంత్‌రెడ్డిలో కలవరం మొదలైంది. తనపై ఫిర్యాదుచేసిన బాధితుడి ఇంటికి రెవెన్యూ అధికారులను పంపి, ఫిర్యాదు వెనక్కి తీసుకోవాని ఒత్తిడి తీసుకొచ్చారు. దీనిపైనా మరోసారి సీసీఎల్‌ఏకు బాధితుడు ఫిర్యాదుచేశారు. ఈక్రమంలో ఆర్డీవోపై సస్పెన్షన్ వేటు వేసి కేసును ఏసీబీకి అప్పగించాలని సీసీఎల్ భావించింది.

కాగా, ఎన్నికలకు ముందు చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లను తొలగించడంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలు వచ్చాయి. అప్పటి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని, సుధారెడ్డి దీనిపై పలుసార్లు ఫిర్యాదులు కూడా చేశారు. పోలింగ్ అనంతరం తిరుపతిలో జరిగిన గొడవలపై వైసీపీది ఎలాంటి తప్పులేనట్టుగా నివేదిక ఇచ్చారు. మరో ఏడాదిలో ఐఏఎస్‌గా పదోన్నతి లభించే అవకాశం ఉన్న అధికారి అవినీతి ఆరోపణలతో సస్పెండవడం చర్చనీయాంశమైంది. అలాగే, ఈ కేసులో అప్పటి పుత్తూరు తహసీల్దారు పరమేశ్వరస్వామి (ప్రస్తుతం అనంతపురం జిల్లా ఆత్మకూరు తహసీల్దారు), కలెక్టర్ కార్యాలయంలోని సంబంధిత సూపరింటెండెంట్ సురేష్‌బాబునూ సస్పెండు చేశారు.

వంద రోజుల కూటమి పాలన భేష్



ప్రభుత్వ ప్రగతిని వివరిస్తూ కరపత్రాలు అందజేస్తున్న అధికారులు, టీడీపీ నేతలు

దక్కిలి, సెప్టెంబరు 20: వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు బాగున్నాయని ప్రజలు కితాబిస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు దక్కిలి చంద్రారెడ్డి అన్నారు. దక్కిలిలోని కందలవారిపల్లిలో శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని అధికారులు. టీడీపీ నేతలు కలిసి నిర్వహించారు. వందరోజుల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో యువతకు మోగా డీఎస్సీ ప్రకటించి రాష్ట్రంలో 16.437 ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని గుర్తుచేశారు. అదేవిధంగా పింఛను ఒకేసారి వెయ్యి రూపాయలు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వడం జరుగుతోందన్నారు. రూ.5 రుచికరమైన భోజనం పెట్టి పేదల ఆకలితీర్చే కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు గుండెల్లో పెట్టుకొని చూస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసన్నకుమారి, కార్యదర్శి ప్రభాకర్, గురుకుల పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ సర్వేపల్లి రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల సమస్యల పరిష్కారానికి కృషి



స్టేడియంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పాశం, మాజీ ఎంపీ వరప్రసాద్

గూడూరు, సెప్టెంబరు 20: ఏఆరెడ్డి ప్రభుత్వ స్టేడియంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఏఆరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో క్రీడాకారులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేడియంలో క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. స్టేడియంలోని జిమ్ శిథిలావస్థకు చేరుకోవడంతో ఇప్పటికే నూతన జిమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్యాలరీ శిథిలావస్థకు చేరుకోవడంతో నూతనంగా నిర్మించేందుకు చర్యలు చేపడుతామన్నారు. సాయంత్ర వేళల్లో కూడా వాకింగ్ చేసుకునేలా వీలుగా లైటింగ్ వ్యవస్థను అభివృద్ధి పరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, వసంత్‌కుమార్, మస్తాన్‌నాయుడు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

'కూటమి పాలన'ను విమర్శించడం తగదు

పెళ్లకూరు, సెప్టెంబరు 20: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనను విమర్శించడం ఎన్‌సీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మానుకోవాలని టీడీపీ ప్రధాన మండల కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి హితవుపలికారు. శుక్రవారం తాళ్వాయిపాడులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతుంటే ఓర్వలేని మాజీ ఎమ్మెల్యే కిలివేటి, కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అర్థరహిత విమర్శలు చేస్తున్నారన్నారు. పింఛన్లు తొలిగించారనడం హాస్యాస్పదమని, అర్హత కలిగిన ఏ ఒక్కరికైనా పింఛను అందకుంటే నిరూపించాలని సవాల్ విసిరారు. టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గంగాబత్తిన రామకృష్ణ మాట్లాడుతూ వరద బాధితులకు సేవలందించడంలో సీఎం చంద్రబాబు నాయుడు చూపిన చొరవ దేశమంతా చూసిందన్నారు. ఎక్కడో ఏసీ గదుల్లో కూర్చొని మాట్లాడం తగదని, వరద ప్రాంతాలకు వెళితే ప్రభుత్వం చేపట్టిన సహాయ కార్యక్రమాలు కళ్లకు కనబడతాయన్నారు. ఇకనైన అసత్య ఆరోపణలు మానుకోవాలని, లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హితువ పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇరుగు వెంకట సుబ్బయ్య, మునీంద్ర, గురవయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

బాలాయపల్లి, సెప్టెంబరు 20: మండలంలోని మన్నూరులో శుక్రవారం పోలేరమ్మ జాతర నిర్వహించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, రాయి సత్యం నాయుడు, ఎంపీటీసీ మురళీ మోహన్‌రెడ్డి, కోటేశ్వరావు, గోపీ కృష్ణారెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోలేరమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

పరిసరాల శుభ్రత పాటించాలి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 20: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈవో మునిరత్నం అన్నారు. స్థానిక బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు.

కోట గ్రామపంచాయతి

బహిరంగ వేలము ప్రకటన

తిరుపతిజిల్లా, కోట గ్రామ పంచాయతీ ఆధీనంలో ఉన్న రూములకు గ్రామ పంచాయతీ ఆవరణలో తే.27-09-2024ది శుక్రవారము 10.30 గం.లకు తేది.01-10-2024 నుండి 30-09-2025 (ఒక సం.ము) కాలపరిమితితో వేలము నిర్వహించబడును.

వ. నెం.	వేలం నిర్వహించవలసిన ఆస్తుల వివరములు	చెల్లించవలసిన ధరావత్తు మొత్తము (రూ.లలో)	కాలపరిమితి
1.	ZPHS (బాలికల) దగ్గర రూమ్ నెం.01 (కిందది)	17,588/-	తేది:01-10-2024 నుండి తేది:30-09-2025 వరకు
2.	ZPHS (బాలికల) దగ్గర రూమ్ నెం.02 (కిందది)	17,325/-	
3.	ZPHS (బాలికల) దగ్గర మిద్ది పైన రూమ్ నెం.03	3675/-	
4.	ZPHS (బాలికల) దగ్గర మిద్ది పైన రూమ్ నెం.04	2888/-	
5.	గ్రామ పంచాయతీ కార్యాలయము వద్ద రూమ్ నెం.01	4200/-	
6.	గ్రామ పంచాయతీ కార్యాలయము వద్ద రూమ్ నెం.02	5250/-	
7.	గ్రామ పంచాయతీ కార్యాలయము వద్ద రూమ్ నెం.03	4200/-	
8.	గ్రామ పంచాయతీ కార్యాలయము వద్ద రూమ్ నెం.04	5250/-	
9.	NCR కళ్యాణ మండపం వద్ద రూమ్ నెం.01	16538/-	
10.	పాత ఇనుము	10,500/-	
11.	పాత కొయ్యలు	25,000/-	
12.	దినపత్రికలు	500/-	

గమనిక: అనివార్య కారణములు ఎదురైనప్పుడు రద్దు చేయుటకు గ్రామ పంచాయతికి అధికారము కలదు.

భవదీయ
సం/- బి.శ్రీనివాసులు,
పంచాయతి కార్యదర్శి
కోట గ్రామ పంచాయతి, కోట మండలం

తమిళనాడు రేషన్ బియ్యం స్వాధీనం

తడ, సెప్టెంబరు 20: అక్రమంగా తరలిపోతున్న తమిళనాడు రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమంగా తరలివెళ్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు రహదారిపై నిఘా పెట్టారు. గురువారం అర్ధరాత్రి సమయంలో అక్కంపేట వద్ద నెల్లూరు వైపు వెళ్తున్న రెండు లారీలను పట్టుకుని ఇద్దరు డ్రైవర్లను అదుపులో తీసుకున్నారు. బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రెండు లారీల్లో ఉన్న రూ.12.58 లక్షల విలువైన 42 టన్నుల బియ్యాన్ని సీజ్ చేశారు. సివిల్ సప్లయాస్ డీటీ ఓబయ్యకు స్వాధీనం చేశారు. లారీ డ్రైవర్లు ఇచ్చిన సమాచారం మేరకు మరో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కొండప్ప నాయుడు తెలిపారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.40వేల అపహరణ

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 20: ఏటీఎం కార్డు మార్చి రూ.40వేలు అపహరించిన ఘటన నాయుడుపేటలో జరిగింది. పట్టణంలోని మూకాంబికాగుడి వీధిలో నివసిస్తున్న ఓ వ్యక్తి నగదు డ్రా చేసేందుకు బజారు వీధిలోని ఓ ఏటీఎంలోకి వెళ్లాడు. అదే సమయంలో ఓ గుర్తుతెలియని యువకుడు డ్రా చేసి ఇస్తానంటూ కార్డు తీసుకున్నాడు. డబ్బులు రాలేదంటూ వేరే కార్డు ఇచ్చేసి అక్కడ నుంచి ఉడాయించాడు. కొంత సమయం తరువాత రూ.40వేలు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో బాధితుడు లబోదిబోమంటూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

జనసేన నాయకుడి సస్పెన్షన్

వెంకటగిరి, సెప్టెంబరు 20: వెంకటగిరి నియోజకవర్గ జనసేన నేత గూడూరు వెంకటేశ్వర్లుపై ఆ పార్టీ సస్పెన్షన్ వేటు వేసింది. ఈ మేరకు శుక్రవారం జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు ఉత్తర్వులు పంపారు. ఇటీవల గూడూరు వెంకటేశ్వర్లు జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి అజయ్‌పై పలుమార్లు విమర్శలు చేయడమే కాకుండా వెంకటగిరిలో పార్టీకి నష్టం కలిగేలా వ్యవహరించడంతో పార్టీ క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. ఈ నెల 30వ తేదీలోగా వివరణ ఇవ్వాలంటూ పార్టీ అధిష్టానం వెంకటేశ్వర్లుకు నోటీసులు జారీ చేసింది. అప్పటి వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా వుండాలని ఆదేశించింది.

వరద బాధితులకు ఆర్థిక సాయం

వెంకటగిరి, సెప్టెంబరు 20: వరద బాధితుల కోసం జనసేన సీనియర్ నాయకుడు జపాల ప్రకాష్ రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి డీడీ అందించారు. వెంకటగిరిలో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే గ్రామ శక్తి పోలేరమ్మ జాతరకు రావాలని పవన్ కల్యాణ్‌ను ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఉమ్మడి నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి వేములపాటి అజయ్ వున్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

బాలాయపల్లి, సెప్టెంబరు 20: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ప్రభుత్వం వంద రోజులు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం తీసుకున్న ప్రజాహిత నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట కరపత్రాలను టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వినీల్ కుమార్, ఈవోపీఆర్డీ మోహన్ రాజు, పంచాయతీ కార్యదర్శి లీలావతి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా టీపీవోకు అదనపు బాధ్యతలు



కమిషనర్‌గా బాధ్యతలు చేపడుతున్న టీపీవో శాంతి

సూళ్లూరుపేట, సెప్టెంబరు 20: సూళ్లూరుపేట మున్సిపాలిటీ కమిషనర్‌గా టౌన్ ప్లానింగ్ అధికారి శాంతికి అదనపు బాధ్యతలు అప్పగించారు. కమిషనర్ గంగా ప్రసాద్ బదిలీపై ఆత్మకూరుకు వెళ్లారు. అప్పటి నుంచి రెగ్యులర్ కమిషనర్‌ను నియమించలేదు. టీపీవోగా పని చేస్తున్న శాంతికి కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించడంతో శుక్రవారం ఆమె బాధ్యతలు తీసుకొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు గ్రామ కమిటీలు

వాకాడు, సెప్టెంబరు 20: మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో మనోహర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్‌గౌడ్ మాట్లాడుతూ మండల స్థాయిలో తహసీల్దారు, ఎంపీడీవో, ఎస్‌ఐ, ఇరిగేషన్ ఏఈలు కమిటీగా ఉంటారన్నారు. ఆయా పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఇంజనీరింగ్ అసిస్టెంట్, మహిళా సంరక్షణ కార్యదర్శి కమిటీగా ఏర్పడి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీసిటీకి ఎక్స్‌లెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగరాజన్

శ్రీసిటీ, సెప్టెంబరు 20: శ్రీసిటీకి మరో ప్రతిష్ఠాత్మక అవార్డు వరించింది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సంస్థ వారి సీఎఫ్‌వో ఎక్సలెన్స్ అవార్డు శ్రీసిటీ ఫైనాన్షియల్ చీఫ్ ఆఫీసర్ (సీఎఫ్‌వో) ఆర్.నాగరాజన్‌కు దక్కింది. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన సదరన్ రీజియన్ సీఐఐ సీఎఫ్‌వో ఎక్సలెన్స్ అవార్డుల మూడవ ఎడిషన్‌లో ఈ అవార్డును అందజేశారు. సీఐఐ మాజీ ప్రెసిడెంట్, ఇన్ఫోసిస్ కో ఫౌండర్, యాక్సిలర్ వెంచర్స్ చైర్మన్ క్రిస్ గోపాల కృష్ణన్, సీఐఐ సీఎఫ్‌వోఎక్సలెన్స్ అవార్డ్ 2023-24 చైర్మన్, భారత్ వోల్వో గ్రూప్ ప్రెసిడెంట్ అండ్ ఎండీ కమల్‌బాలి చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. మౌలిక కల్పన రంగంలో ఆర్థిక రంగం నిపుణుడిగా నాగరాజన్ చూపిన ప్రతిభ, కృషికి గుర్తింపుగా ఆయనకు ఈ గౌరవం దక్కింది.

పోలేరమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లు: జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 20: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లు చేయాలని, భక్తులందరికీ అమ్మవారి దర్శనం కలిగేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ అన్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో జాతర నిర్వహించనున్న నేపథ్యంలో శుక్రవారం వెంకటగిరి పట్టణంలోని పింజల వీరయ్య కల్యాణ మండపంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు జాతర నిర్వహణను బాధ్యతగా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎండోమెంట్ ఈవో, మున్సిపల్ కమిషనర్, ఆర్‌అండ్‌బీ, పోలీస్ శాఖ పటిష్టమైనా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈవో శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ అమ్మవారి దర్శనార్థం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తులకు ఉచిత దర్శనంతో పాటు రూ.100, రూ.200, రూ.500 క్యూలైన్లు ఉంటాయన్నారు. గూడూరు డీఎస్పీ మాట్లాడుతూ జాతరలో 1200 మంది పోలీసు సిబ్బంది పాల్గొంటున్నారు. 7 సెక్టార్లుగా విధులు నిర్వహిస్తూ ఎటువంటి అసౌర్యాలకు తావులేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని, 300 సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తామని వివరించారు. వెంకటగిరి ఆర్టీసీ డిపో నుంచి వివిధ ప్రాంతాలకు 80 బస్సులు నడుపుతున్నామని డీఎం తెలిపారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ..... గతంలో ఎన్నడూ నిర్వహించి విధంగా ఈ ఏడాది అమ్మవారి జాతర కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించాలన్నారు. పట్టణంలో ఎక్కడా పారిశుధ్య లోపం లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ రవిమనోహరాచారి, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, సీఐ ఏవీ రమణ, ఎస్‌ఐ సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు ఘటోత్సవం

పోలేరమ్మ జాతర ఘటోత్సవంతో ఆదివారం ప్రారంభం కానుంది. మధ్యాహ్నం 3గంటలకు పనిబాటల వారు ఘటోత్సవాన్ని ప్రారంభిస్తారు. తరువాత వచ్చే బుధ, గురువారాల్లో పోలేరమ్మ జాతర నిర్వహిస్తారు.

కూటమిది ప్రజారంజక పాలన: ఎమ్మెల్యే విజయశ్రీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 20: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట మండలంలోని పుదూరులో శుక్రవారం రాత్రి 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పింఛను రూ.4వేలకు పెంపు, టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభించినట్లు వివరించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తూనే, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత చంద్రబాబుకే దుక్కుతుందన్నారు. రాబోవు కాలంలో సంపూర్ణ సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇక సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఎన్‌ఆర్‌జీఎస్ ద్వారా మంజూరైన రూ.12 కోట్లతో అభివృద్ధి పనులను చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వరదలు వచ్చిన సమయంలో హెలి కాప్టర్‌లోనే ఎరియల్ సర్వే నిర్వహించి ప్రజలను కలవకుండానే వెళ్లిన సంఘటనలు ప్రజలు మరచిపోలేదన్నారు. సీఎం చంద్రబాబు వయస్సును లెక్కచేయకుండా వరద బాధితులను సహాయ సహకారాలు అందించడం ప్రజలు గుర్తించారన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు గీతావాణి, ఇన్‌చార్జి ఎంపీడీవో శర్మ, ఎంఈవో మునిరత్నం, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, చంద్రారెడ్డి, శ్రీనివాసులునాయుడు, విజయకుమార్ నాయుడు, రామిరెడ్డి, పార్థసారధి, రత్నం, పళణి, మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకే పోటీలు



షాట్‌పుట్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో సనత్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 20: విద్యార్థుల్లో దాగివున్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం పోటీలను నిర్వహిస్తోందని ఎంఈవో సనత్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఏఆరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడాపోటీలు, ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండురోజుల పాటు అండర్-14, అండర్-17 విభాగాల్లో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను ఎంపికచేసి ఈనెల 26న కోట జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, పీఈటీలు కరిముల్లాఖాన్, సుబ్రహ్మణ్యం, శివకుమార్ పాల్గొన్నారు.

చిల్లకూరు: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడాపోటీలను ఎంఈవోలు సతన్‌కుమార్, రఫూఫ్ ప్రారంభించారు. హెచ్ఎం జాన్‌పీటర్, పీడీ శ్రీనివాసులు, మల్లికార్జున్, ఆయా పాఠశాలల పీడీలు తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిటౌన్: స్థానిక గురుకుల పాఠశాలలో క్రీడాపోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ పారంభించారు. ఎంపీపీ తంబిరెడ్డి తనూజా, ఎంపీడీవో కోటీశ్వరరావు, పూజారి లక్ష్మీ, రజిని, ఎంఈవో బాబయ్య పాల్గొన్నారు.

ఓజిలి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను ఎంపీడీవో రజనీకాంత్, ఎంఈవో శైలజ, చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయురాలు మంజుల, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ హరిబాబు ప్రారంభించారు. ఈవోపీఆర్డీ మోహన్, ఉపాధ్యాయులు పరంధామయ్య, శరత్‌కుమార్, మురుగేశ్వరి, శ్రీలక్ష్మి, రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంఈవో శంకరయ్య, ప్రధానోపాధ్యాయులు టీడీపీ సీనియర్ నాయకులు దామెర ప్రసాద్ నాయుడు, కేవీ నాయుడు, కురిమేటి ఉదయ్‌కుమార్ నాయుడు, నరేంద్ర యాదవ్, బైనా సుబ్రహ్మణ్యంరెడ్డి, గురవయ్య, నరేంద్రనాయుడు, పరుశురాం, వెంకటేశ్, రవి పాల్గొన్నారు.

వాకాడు: మండలంలోని అంబేడ్కర్ గురుకులంలో మండలస్థాయి ఆటల పోటీలను ప్రిన్సిపాల్ రామాంజనేయులు, ఎంపీడీవో మనోహర్‌గౌడ్ ప్రారంభించారు. విద్యార్థులకు అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు.

హామీల అమలుతో ప్రజాసంక్షేమానికి బాటలు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో, టీడీపీ నాయకులు

గూడూరు, సెప్టెంబరు 20: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం నేరవేరుస్తూ ప్రజాసంక్షేమానికి బాటలు వేస్తోందని తిరుపతి పార్లమెంటు తెలుగు రైతు కార్యదర్శి దుద్దా రాఘవరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తిప్పవరప్పాడు గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నామన్నారు. పెన్షన్‌ను రూ.1000 పెంచి రూ.4000 చేయడంతో పాటు 1వ తేదీన ఇంటి వద్దనే అందస్తున్నామన్నారు. ల్యాండ్‌టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుతో పాలు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చెన్నూరు గ్రామంలో మాజీ వైస్‌ఎంపీపీ మట్టం శ్రావణి ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మన్నారుపోలూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 20: ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ మండల అధ్యక్షుడు కొక్కు శంకరయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొరిడి, కుదిరి, కేసియన్ గుంట గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటా తిరిగి కరపత్రాలను అందజేశారు. అదే విధంగా మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు, కోళ్లమిట్ట ప్రాంతాల్లో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వ చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలారాణి, టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, కృష్ణయ్య, ఎల్లయ్య, శంకరయ్య, మునస్వామి పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

సూళ్లూరుపేట, సెప్టెంబరు 20: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాల్సిన అవసరం ఉందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ అన్నారు. స్త్రీలపై దాడుల నివారణకు చర్యలు అనే అంశంపై శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే స్త్రీలను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ ప్రభుత్వ వైద్యురాలు శైలజ, వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, అధ్యాపకులు అమ్మాజీ, సల్మా, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆరిమేనిపాడులో గ్రావెల్ తరలింపు

అడ్డుకున్న గ్రామస్తులు
అనుమతి ఉందని నిర్వాహకుల వాగ్వాదం

ఓజిలి, సెప్టెంబరు 20: ఓజిలి మండలం ఆరిమేనిపాడులో గ్రావెల్ తరలింపును గ్రామస్తులు అడ్డుకున్నారు. తమకు అనుమతి ఉందంటూ క్వారీ నిర్వాహకులు వాగ్వాదానికి దిగడంతో వివాదం చోటుచేసుకుంది. గురువారం రాత్రి ఆరిమేనిపాడు క్వారీ వద్ద యజమానులకు సంబంధించిన వస్తువులను గ్రామస్తులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో క్వారీ యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, ఓజిలి ఎస్ఐ స్వప్న సిబ్బందితో ఆరిమేనిపాడుకు వెళ్లి గ్రామస్తులతో మాట్లాడి సర్దుబాటు చేశారు. శుక్రవారం గ్రామస్తులు, గ్రావెల్ తరలింపుదారులు రెవెన్యూ, పోలీసుల వద్దకు వెళ్లి పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. రెవెన్యూ, పోలీసులు ఇరువురితో మాట్లాడి 15 రోజుల వరకు గ్రావెల్ తరలింపును నిలిపివేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ లోగా విచారించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

బయో ఇథనాల్ ప్లాంట్‌కు భూపరిశీలన

నాయుడుపేట, సెప్టెంబరు 20: నాయుడుపేట మేనకూరు సెజ్‌లో బయో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్న బ్లామర్ లారీయా ఇండియా డైరెక్టర్ (మ్యానిఫ్యాక్చరింగ్) ఆర్ఎం ఉతయ రాజాకు సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని శుక్రవారం స్వాగతం పలికారు. సెజ్‌లో బయో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు కోసం భూమిని పరిశీలించారు. వారితో తహసీల్దారు గీతావాణి, డీటీ రాజేంద్ర, ఏపీఐఐసీ సిబ్బంది ఉన్నారు.



పరిశ్రమ ప్రతినిధులను స్వాగతిస్తున్న ఆర్డీవో చంద్రముని

ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించండి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎంపీడీవో విజయకుమార్

తడ, సెప్టెంబరు 20: వంద రోజుల ప్రభుత్వ పనితీరు, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని ఎంపీడీవో విజయకుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆదివారం వాటంబేడులో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరుగుతుందని, విజయవంతం అయ్యేలా ప్రతి పంచాయతీ కార్యదర్శి కృషి చేయాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు గాబ్రియల్, మస్తాన్, ఎస్‌డీ బాబు, శివశంకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సక్రమంగా చేపట్టండి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 20: ఉపాధి హామీ పనులను సక్రమంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం నిర్వహించి కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటయ్య, నారాయణ ఎంపికయ్యారు.